సత్యదేవుడికి శ్రీపుష్పయాగం 7



డిస్పోజబుల్!

ప్రజారోగ్యంపై ప్లాస్టిక్ భూతం

ఇలా తెచ్చినా ప్రమాదమే సుమా : ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయలు

ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడతారు.. ప్రస్తుత తరానికి ఈ సామెత అతికినట్టు సరి పోతోంది.. అనువుగా ఉంది కదా అని వినియోగానికి ప్లాస్టిక్ అనే గొయ్యి తవ్వుకున్నారు.. ప్రస్తుతం అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారు.. అలాగని వదల్లేకపోతున్నారు..క్యాన్సర్ వంటి మహమ్మారి చుట్టుముడుతున్నా అదే తీరు.. మార్పు కానరావడంలేదు.. ఒకనాడు జనా వాసంలో ప్లాస్టిక్ వినియోగం లేదు.. క్యాన్సర్ కేసులు లేవు..ప్రస్తుతం వినియోగం పెరిగింది.. టీ తాగే కప్ నుంచి భోజనం చేసే ప్లేట్ వరకూ అంతా ప్లాస్టిక్కే.. దీంతో రకరకాల క్యాన్సర్ కేసు లు జనంపై దాడులు చేస్తున్నాయి.. చిన్న వయ సులోనే ప్రాణాలు తీస్తోంది.. అయినా మన జీవ న విధానంలో మార్పురావడంలేదు.. నేను ఆరోగ్యంపై చాలా శ్రద్ధ తీసుకుంటాను..నాకెలా క్యాన్సర్ వచ్చిందనే వాళ్లు ఒకసారి ఆలోచిస్తే అసలు కథ బోధపడుతుంది.. ఇకనైనా మారాల్సిందే.. ప్లాస్టిక్ వదిలేయాల్సిందే.. - (రాజమహేంద్రవరం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)



చూశారా..చిత్రం : కాకినాడ దమ్ములపేట వద్ద డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది.ప్రజారోగ్యాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయని ఎన్ని అవగాహన కార్యక్రమాలు సాగుతున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మా ర్పు రావడం లేదు. ఇక వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు.దీంతో ప్లాస్టిక్ వినియోగం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోతోంది. ప్లాస్టిక్‌ను స్థానిక సంస్థలు నిషేధించినా.. అమలులో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. కింది స్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా మారి పోయింది.దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి

- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- అరికట్టలేకపోతున్న అధికార గణం
- రోగాలకు గురవుతున్న జనం
- క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం
- రోజుకు 300 టన్నుల వ్యర్థాలు
- డంపింగ్‌యార్డుల నిండా అదే
- ఇకనైనా దృష్టి పెట్టాల్సిందే
- లేకపోతే సర్వనాశనమే

ఇదీ సర్వే మాట

మనం వాడి పడేస్తు న్నాం.. మనకేంటి.. అని సంబర పడుతుంటే ప్లాస్టిక్ వ్యర్థాల్లో కాలు వేసి నట్లే. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు, టీ తదితర ఆహార పదార్థాలు తీసుకురావడం. ప్యాకేజింగ్‌కి ప్లాస్టిక్ సంచులను వాడడం, ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారు చేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని విని యోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రం గులు రావడానికి ఎన్నో రసాయనాలు కలు పుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూల తలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదు గుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల దారుణ రుగ్మతల బారిన పడుతున్నామని వివిధ సర్వేలు చెవిలో పోరు పెడుతేన్నాయి.

ప్లాస్టిక్‌ను వదిలేద్దాం!

ఒక్క ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి పదేళ్లు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అనంతం. అందువల్ల పాలిథీన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాల్సిందే. ఇవాళ పాలి థీన్ సంచి అవసరమైతే చిన్న కిళ్లీ బడ్డీలో కూడా దొరుకుతుంది. నార సంచి కావాలంటే వెతుకు లాడాల్సిందే.ఈ పరిస్థితి మారాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వాటిని ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్, జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళా దుంప నుంచి తీసే పిండి బయో పాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్ది రోజులకే భూమిలో కలిసి పోవడం వల్ల పర్యావరణానికి హాని ఉండదు. ఇలాంటి ప్రత్యా మ్నాయాలపై తక్షణమే దృష్టి సారించాలి.



టీ కప్‌లో తుఫాన్..

ప్లాస్టిక్ టీ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు వినియోగం బాగా పెరిగింది. టీ దుకాణాల వద్ద వేడి టీని పాలిథీన్ కవర్లలో వేస్తున్నారు.దాని వల్ల పాలిథీన్ కవర్ కరిగి ఆ టీలో కలిసిపోతుంది. అది తాగిన వారికి కొన్ని రోజులకు కాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. డిస్పోజబుల్ కప్‌లో చిన్న ప్లాస్టిక్ పొర ఉంటుంది.

క్యాన్సర్ కొనితెచ్చుకుంటున్నాం..

రోజులో మన వాడకాల్లో సగానికిపైగా ప్లాస్టిక్ భూతమే ఉంటోంది.పర్యావరణం,ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తోంది. కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు రకరకాల క్యాన్సర్లకి కారణమవుతూ కుటుంబాల్లో ప్రళయాన్ని సృష్టిస్తున్నాయి.75 మైక్రాన్లలోపు మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు.75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న పాలిథీన్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తున్నారు.వీటిని నియంత్రించిన అధికారు లు చోద్యం చూస్తున్నారు. ప్రజలు వినియోగించిన పాలిథీన్ కవర్లను రోడ్లపై వేయడంతో అవి మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయని జంతుప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 300 టన్నులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రోజుకు సగటున సుమారు 600 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 300 టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటు న్నాయి. ఎక్కడైనా డంపింగ్‌యార్డ్ వద్దకు వెళ్లి చూడండి.. అంతెందుకు గోదావరి గట్టుకు వెళ్లి చూడండి ప్లాస్టిక్ కనిపించకుండా చెత్త ఉండదు.హోల్‌సేల్ దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. స్వచ్ఛభారత్ వంటి పురస్కారాల కోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాల లెక్కను తొక్కిపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్లాస్టిక్ వస్తువు లేని ఇల్లు లేదు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేని డ్రెయినూ కనబడదంటే అతిశయోక్తి కాదేమో!.



కాకినాడలో డెయిరీఫాం సెంటర్ వద్ద ఇలా..



కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆర్అండ్‌బీ రహదారి

దారి మారు!

రహదారులపై కోట్లు పోస్తున్న ప్రభుత్వం

- అన్ని దారుల వైపు చూపు
- రోడ్లపై సాఫీగా ప్రయాణం
- 10 నెలల్లో రోడ్లు బాగుబాగు
- నాబార్డు నిధులు విడుదల
- 16 రోడ్లకు 29.92 కోట్లు
- టెండర్లు పిలవాలని ఆదేశం

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తోంది. ఇప్పటికే ఆర్అండ్‌బీ రహదారులకు రూ.200కోట్లకు పైగా విడుదల చేసింది.. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని 39 పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ.73.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 76.188 కిలోమీటర్ల పొడవునగల 16 రహదారుల అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.29.92 కోట్లను విడుదల చేస్తూ జీవో జారీ చేసింది.ఈ మేరకు టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది.వర్షాకాలం నాటికి రాష్ట్రంలో రహదారులపై ఎక్కడ గుంతలు కనబడకూడదని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్ధిష్టంగా ఆదేశాలిచ్చారు. ఆర్అండ్‌బీశాఖ తాత్కాలిక, శాశ్వత కార్యాచరణలు సిద్ధం చేసుకుని తదనుగుణంగా పనులు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రహదారుల మరమ్మతుల పనులు చేపట్టి 75 శాతం వరకూ పూర్తి చేసింది. మిగిలిన పనులు వర్షాలు రాకుండా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కాకినాడకు రూ.13.20 కోట్లు

- నాబార్డు ఆర్ఐడీఎఫ్ 30వ విడత ద్వారా కాకినాడ జిల్లాలో 37.516 కిలోమీటర్ల పొడవు గల ఆరు రహదారుల అభివృద్ధికి రూ.13.20 కోట్లు మంజూరు చేశారు. తిప్పరాజుపాలెం-కాజులూరు రోడ్డుకు రూ3.10 కోట్లు, రావికంపాడు-రమణక్కపేట రోడ్డుకు రూ.2 కోట్లు, యండపల్లి జంక్షన్-నాగులాపల్లి-రావివారిపోడు రోడ్డుకు రూ.3.50 కోట్లు,జెడ్.రాగంపేట ఎన్‌హెచ్ నుంచి నాయకంపల్లి రోడ్డుకు రూ.60లక్షలు,ఏలేశ్వరం-జడ్డంగి లింక్ రోడ్డుకు రూ.కోటి,కట్టమూరు-కాండ్రకోట-జె.తిమ్మాపురం రోడ్డుకు రూ.3 కోట్లు.

తూర్పుగోదావరి జిల్లా..

- తూర్పుగోదావరి జిల్లాలో 26.807 కిలోమీటర్ల పొడవు గల 8 రహదారుల అభివృద్ధికి రూ.12.50 కోట్లు కేటాయించారు. ఆర్‌కేరోడ్డు శాటిలైట్ సిటీ-సంపత నగరం-జి.యర్రంపాలెం-కొత్తతుంగపాడు రోడ్డుకు రూ.2 కోట్లు, పెద్దాపురం ఏడీబీ రోడ్డు-నాయకంపల్లి-జి.దొంతమూరు రోడ్డుకు రూ.80 లక్షలు, వీరవరం-దుళ్ల రోడ్డుకు రూ.1.80 కోట్లు, రాజవోలు-వేమగిరి-కడియం-కొత్తూరు రోడ్డుకు రూ.50 లక్షలు, యర్రాయిచెరువు-పి.వేమవరం రోడ్డుకు రూ. 1.26 కోట్లు, వడ్లూరు-తీపర్రు రోడ్డుకు రూ.3.24 కోట్లు, తేతలి-మునిపల్లి రోడ్డుకు రూ.60 లక్ష లు, పశివేదల-ఆరికిరేవుల రహదారి అభివృదికి రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి.

కోనసీమ జిల్లా..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11.865కిలోమీటర్ల పొడవు గల రెండు రహదారుల అభివృద్ధికి రూ.4.22 కోట్లు కేటాయించారు. శివకోడు-రామరాజులంక, లక్కవరం-శంకరగుప్తం, శివకోడు మునలమ్మ ఆలయం నుంచి విశ్వేశ్వరరాయపురం రోడ్ల అభివృద్ధికి రూ.2.50కోట్లు,గోపాలపురం నుంచి గంటి-లొల్ల రోడ్డు,గోపాలపురం-పొడగట్లపల్లి రోడ్డు, గంటి-గోపాలపురం పుష్కరఘాట్-పొడగట్లపల్లి రోడ్ల అభివృద్ధికి రూ.1.72 కోట్లు మంజూరు చేశారు.

జిల్లాలో ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యురాలి పర్యటన

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయానీ రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్నారు. బుధ, గురువారాల్లో జిల్లా అధికారులతో కలిసి పలు ప్రదేశాలను పరిశీలిస్తారు.గురువారం సాయంత్రం 4గంటలకు విమానంలో బయలుదేరి ఢిల్లీ తిరుగు పయనమవుతారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఆమె పర్యటనకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

చెరువుల్లో సిల్టు తొలగింపునకు అనుమతులు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ మే 4(ఆంధ్రజ్యోతి): చిన్న నీటి పారుదల చెరువులు(మైనర్ ఇరిగేషన్)లో రైతులు తమ సొంత ఖర్చులతో సిల్టు తవ్వకం, రవాణాకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 203 జారీచేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిల్టు తొలగించడానికి ముందుకు వచ్చే రైతులకు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో షరతులతో కూడిన అనుమతులిస్తామన్నారు. నిబంధనల మేరకు సిల్ట్ తొలగింపు పనులు చేయాలన్నారు.

పక్కింటికి భోజనానికెళితే.. ఇల్లు దోచేశారు..

రాజానగరం, మే 13 (ఆంధ్రజ్యోతి) : పక్కింటికి భోజనానికి వెళితే ఇంట్లో దొంగలు పడ్డారు. మండలంలో వెలుగుబందలో ఓ ఇంట్లో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి విలువైన బంగారు ఆభరణాలను అపరించుకు పోయారు. గ్రామానికి చెందిన జాలెం గోపీరత్నం మంగళవారం ఇంటికి గడియపెట్టి పక్కింటికి భోజనానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెలిసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించుకోగా 4 కాసుల బంగారు ఆభరణం అపహరణకు గురైనట్టుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజానగం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సీఎఫ్ఎంఎస్..పంచాయితీ!



- డిజిటల్ సైన్ పక్కదారి
- పనిచేయని కమిషనర్ తంబ్
- గత ఆరు నెలలుగా ఇదే తంతు
- కార్యదర్శులకు ఇబ్బంది
- కలెక్టర్‌కు ఫిర్యాదు?
- రహస్య విచారణకు ఆదేశం
- నేడో రేపో నివేదిక

రాజమహేంద్రవరం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో పది గ్రామాల సీఎఫ్ఎంఎస్ పంచాయితీ కలెక్టర్ దృష్టికి వెళ్లింది. గ్రామాల్లో ఎలాంటి ఖర్చులు చేపట్టినా బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్ ద్వారానే జరుగుతాయి. ప్రతి బిల్లు సీఎఫ్ఎంఎస్‌లో నమోదు చేసిన తరువాత సంబంధిత అధికారి వేలిముద్ర వేసిన మీదట చెల్లింపులు జరుగుతాయి. ఆయా గ్రామాల, మండలాల డీడీవో అధికారికే తంబ్ వేసే అధికారం ఉంటుంది. రూరల్ మండల పరిధిలో గల 10 గ్రామాలకు ప్రత్యేకాధికారి నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ కావడంతో ఆయనే తంబ్ వేయాల్సి ఉంటుంది. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు నెలవారీ జీతాలు, కార్యాలయాల నిర్వహణ, అభివృద్ధి పనుల నిమిత్తం చేసిన ఖర్చులకు సంబంధించి కమిషనర్ వద్దకు వెళుతుంటే తంబ్ పని చేయడం లేదు. దీంతో మరలా పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి మార్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఎందుకంటే డిజిటల్ సైన్‌లో ఎలాంటి మార్పులు చేయాలన్నా ఎంపీడీవో సెల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ నెంబరు నమోదు చేస్తేనే మార్పు జరుగుతుంది. సుమారు 6 నెలలుగా ఇదే తంతు కొనసాగుతుంది.ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శులు కమీషనర్‌కు ఫిర్యాదు చేసారో లేక, ఆయన పరిశీలనలో తేలిందో తెలియదు గాని వ్యవహారం జిల్లా కలెక్టర్‌కు కమిషనర్ తెలియజేసినట్టు సమాచారం. దీనిపై మండల పరిధిలోని కొందరు కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అధికారిని పిలిపించి కలెక్టర్, కమిషనర్లు నేరుగా ఆరాతీసినట్టు తెలి సింది. ఒక అధికారికి డీడీవోగా బాధ్యతలు అప్పగించిన తరువాత ఆ అధికారి బదిలీ అయి నపుడో.. లేక మరొక అధికారికి బాధ్యతలు అప్పగించినప్పుడు మాత్రమే డిజిటల్ సైన్ (తంబ్) మార్చాలి. అలాంటిది ఒక ఐఏఎస్ అధికారి ప్రత్యేకాధికారిగా ఉన్న గ్రామాలకు సంబంధించి తరచు రూరల్ మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తంబ్ మార్చడాన్ని కలెక్టర్, కమిషనర్‌లు సీరియస్‌గా తీసుకున్నారు.దీనిపై ట్రిజరీ అధికారుల నుంచి నివేదిక తీసుకున్నారు.

వీణాదేవి విచారణ..

ఈ ఘటనకు సంబంధించి జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జి వీణాదేవిని విచారణాధికారిగా నియమిం చినట్టు తెలిసింది.కలెక్టరేట్‌లోని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జి కార్యాలయంలో మంగళవారం రూర ల్ మండల పరిధిలోని గ్రామ కార్యదర్శుల నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారు..అదే విధంగా రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు నుంచి తీసుకున్నా రు.అనంతరం నివేదికను కలెక్టర్, పంచాయతీ రాజ్‌కు కమిషనర్ పంపనున్నారు.



పరీక్షలపై సమీక్షిస్తున్న డీఆర్వో

19 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 28 వరకూ నిర్వహించే పదో తరగతి, ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో టి.సీతా రామమూర్తి ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం అధికారులతో సమీక్షించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 28 కేంద్రాల్లో రెగ్యులర్ 3,167, ప్రైవేటు 686 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఏపీ ఓపెన్ స్కూల్‌కి సంబంధించి పదో తరగతి 589 మంది 6 పరీక్షా కేంద్రాల్లో, ఇంటర్ విద్యార్థులు 771 మంది 4 కేంద్రాల్లో పరీక్షలు రాస్తారని చెప్పారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ జరుగుతాయన్నారు. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని తెలిపారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్దేశిత సమయం కంటే ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఈవో వాసుదేవ రావు, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీ కుమారి, ఎంపీఐ సీహెచ్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 380 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్ విభాగంలో 335 మంది, వొకేషనల్‌లో 45 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎస్ నరసింహం తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ కలిపి మొత్తం 9955, వొకేషనల్‌లో 625 మంది పరీక్షలు రాశారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాత్రి వేళల్లో గస్తీ పెంచండి

- పాత నేరస్తులపై నిఘా పెట్టాలి
- క్రైం టీమ్‌లు అప్రమత్తం కావాలి
- క్రైం సమీక్షలో ఎస్పీ ఆదేశం

రాజమహేంద్రవరం, మే 13(ఆంధ్రజ్యోతి): క్రైం టీంలు, స్పెషల్ పార్టీ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని..ముఖ్యంగా రాత్రి వేళల్లో నేరాలను అరికట్టడానికి గస్తీ పెంచాలని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆస్తి నేరాలపై సమీక్షించారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను ప్రశ్నించడంతో పాటు ఫింగర్ ప్రింట్ డివైజెస్, ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ల ద్వారా వివరాలను పరిశీలించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై పోలీసులకు సమాచారం ఇవ్వడంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తుల నేరాల్లోని పాత నేరస్తులు,జైలు నుంచి విడుదలవుతున్న వాళ్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న నిర్మానుష్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ డంతో పాటు రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ నిర్వహించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీలతో పాటు అసాంఘిక వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పటిష్టం చేయాలన్నారు.డ్రోన్ కెమెరాల వ్యవస్థ వినియో గించి నేరస్తులపై దృష్టి పెట్టాలన్నారు.కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు,ఎస్ఐలు, క్రైం, స్పెషల్ పార్టీ విభాగాల పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రాణం తీసిన ఈత సరదా | 7 | భర్తకు చిక్కిన భార్య, ప్రియుడు



భూసేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భూసేకరణపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం, మే 13(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు విమానాశ్రయ, రైల్వే, జాతీయ, రాష్ట్ర రహదారులు, పురపాలన, బీసీ సంక్షేమ శాఖల విషయంలో భూసేకరణపై రెవెన్యూ, సంబంధిత శాఖల ప్రతినిధులతో ఆమె మంగళవారం సమీక్షించారు.27 అంశాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. ఏడీబీ రోడ్డు, రైల్వేకు సంబంధించి కాపవరం, జేగురుపాడు, నిడదవోలు, సింగవరం,శెట్టిపేట, ఆర్అండ్‌బీకి సంబంధించి నిడదవోలు,కొవ్వూరు మునిసిపాలిటీ పరిధిలోని మురుగు నీటి శుద్ధి కేంద్రం, గంగోలు, సాగిపాడు,దొండపూడి,కరగపాడు, పట్టిసీమ, కొవ్వూరు హైవే, బీసీ సంక్షేమ భవనాలకు చెందిన భూసేకరణపై చర్చించామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామ్మూర్తి,ఆర్డీవోలు కృష్ణ నాయక్,రాణిసుస్మిత తదితరులు పాల్గొన్నారు.



పాదగయలో పూజల్లో పాల్గొన్న తుమ్మల రామస్వామి (బాబు), జనసేన నేత శ్రీనివాసరావు

పాదగయలో సుదర్శన హోమం

సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం ఉండాలంటూ పూజలు

పురుహూతికా అమ్మవారికి పట్టువస్త్రాలు పంపిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పిన భారత సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం మెండుగా ఉండాలని కోరుకుంటూ పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మంగళవారం జనసేన నాయకులు పూజలు, హోమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవత పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో సుదర్శన హోమం జరిగింది. పురుహూతికా అమ్మవారికి ఖడ్గమాల కుంకుమార్చన, స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టు వస్త్రాలను డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి (బాబు), పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పురుహూతికా అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఉచిత ప్రసాద వితరణ జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, చల్లా లక్ష్మి, డాక్టర్ వరలక్ష్మి, మురాలశెట్టి సునీల్‌కుమార్, సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, జోగా రమణ, ఆగంటి ప్రభాకరరావు, కరణం సూరిబాబు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.





సుదర్శన హోమంలో పాల్గొన్న జన సైనికులు, పురుహూతికా అమ్మవారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

బిక్కవోలులో సుబ్రహ్మణేశ్వర స్వామికి లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



లక్ష్మీగణపతి స్వామికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



బిక్కవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో అమాయకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులపై భారత సైన్యం చేస్తున్న పోరాటం... ఒక మతం, దేశంపై చేస్తున్నది కాదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అంతకు ముందు ఆయన జనసైనికులతో కలిసి బస్సులో వచ్చి ముందుగా గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలనంతరం ఆలయం ముందు హారతులిచ్చి విలేకరులతో మాట్లాడారు. దేవతలకు సర్వసైన్యాధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి అని ఆయన సురులను అసురుల నుంచి కాపాడారన్నారు. దుష్ట ముష్కరులు మన దేశంపై దాడి చేస్తే కాపాడిన నిజమైన సైన్యాధ్యక్షులు మన భారత సైనికులన్నారు. వారు చూపిస్తున్న తెగువ, త్యాగాలను దృష్టిలో వుంచుకుని వారికి ఆత్మస్థైర్యం, ధైర్యం ఇవ్వాలని, ప్రధాని మోదీ ఈ దేశాన్ని రక్షించడానికి, సమైక్యంగా వుంచడానికి చేస్తున్న ప్రయత్నానికి బాసటగా నిలబడతామంటూ దక్షిణాపథాన వున్న అన్ని షణ్ముఖ క్షేత్రాల్లో అభిషేకాలు చేయాలని పవన్‌కల్యాణ్ ఆదేశాలలో తాము పూజలు చేస్తున్నామన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వున్న ఈ విశాల భారతదేశంలో భిన్న మతాలు, భిన్న భాషలు మాట్లాడే వారు, భిన్న సంస్కృతులు కలవారు వున్నారన్నారు. వీరందరినీ కలగలిపి ఒకటిగా నిలబెట్టి భిన్నత్వంలో ఏకత్వం తీసుకువస్తున్న ప్రధాని మోదీ చేతులకు బలం చేకూర్చాలని ద్వారా ఈ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని, శాంతి కాముకంగా వున్న ఈ దేశంలో ఎలాంటి అరాచకాలు జరగకుండా వుండాలని ప్రార్థించామన్నారు. తీవ్రవాదులు మనపై దండెత్తితే ఏవిధంగా ప్రతీకారం చూపగలమో ఆపరేషన్ సిందూర్ ద్వారా చూపగలిగామన్నారు. తెగబడుతున్న ఉగ్రవాదులను పూర్తిస్థాయిలో ఉపేక్షించమని నిరూపించేలా కార్యక్రమాలు చేశామని, దీనికి దైవబలం కూడ తోడవ్వాలనే ఆలోచనతో కేవలం హిందూ దేవాలయాలే కాక మసీదు, చర్చిల్లో కూడా జనసేనకు చెందిన వివిధ మతాల వారు ఇలాంటి పూజలు చేయాలని కోరామన్నారు. ఒకే మాట, ఒకే దేశం, ఒకే పద్ధతిగా వెళ్లాలని, అన్ని కులాలు, మతాల వారిని కలుపుకుని ముందుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు దైవ బలం తప్పనిసరిగా ఆశీర్వాదం ఇస్తుందని నమ్ముతూ దేశ సమగ్రతకు అందరూ కృషి చేయాలని మంత్రి దుర్గేష్ కోరారు. అనంతరం గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన బిక్కవోలులోని ప్రాచీన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దుర్గేష్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి వినతిపత్రం అందజేశారు. ఏపీటీడీసీ డైరెక్టర్ గంటా స్వరూప, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు ప్రియసౌజన్య, జనసేన అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం నగర శాఖ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి, రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులో శాంతి ర్యాలీలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, కూటమి నేతలు


చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉన్న పురాతన ఆది బౌద్ధ స్థూపం అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామంలోని ఆది బౌద్ధ స్థూపాన్ని ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన ఈ బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.







బర్మా దేశం నుంచి బుద్ధిస్టులు పంపిన బుద్ధుని పాలరాతి విగ్రహం (ఎడమ), తైవాన్ దేశం నుంచి వచ్చిన విలువైన బుద్ధుడి కాంస్య విగ్రహం (కుడి)



ఆదుర్రులోని బౌద్ధ స్థూపం. దాని చుట్టూ ఉన్న ఉప స్థూపాలు

ఆది ఊరు... అభివృద్ధి ఊసేలేదు!

- ఆదుర్రు బౌద్ధ క్షేత్రాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

(మామిడికుదురు-ఆంధ్రజ్యోతి)

అశోక చక్రవర్తి నిర్మించిన 84వేల బౌద్ధ స్థూపాలను 60 మహా స్థూపాలుగా, మూడు దివ్య స్థూపాలుగా తీర్చిదిద్దారు. ఈ మూడు దివ్య స్థూపాల్లో మొదటిది ఆదుర్రులోను, రెండోది సాంచీలోను, మూడోది సారనాథ్‌లో ఉన్నట్టు చరిత్ర తెలియచెప్తోంది. ఆదుర్రులోని బౌద్ధ స్థూపాన్ని అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర సముద్ర యానం ద్వారా వచ్చి నిర్మాణాన్ని పర్యవేక్షించినట్టు చరిత్ర చెప్తోంది. వైనతేయ నదీతీరంలో 74 ఏళ్ల క్రితం ఈ బౌద్ధ స్థూపం బయల్పడింది. నాడు ఆది ఊరుగా పిలవబడిన గ్రామం నేడు ఆదుర్రుగా మారింది.

పూర్వం గ్రామంలో ఈ దిబ్బను దూబరాజు దిబ్బగా పిలిచేవారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఈ దిబ్బను స్థల యజమాని తవ్వుతుండగా పెద్ద పెద్ద ఇటుకలు బయటపడ్డాయి. పనివారిలో బర్మా వెళ్లి వచ్చిన ఒకరు అవి బుద్ధునివని తెలపగా ప్రభుత్వానికి ఈ విషయం స్థానికులు తెలియజెప్పారు. ప్రభుత్వం 1953లో రక్షిత ప్రాంతంగా ప్రకటించింది. అనంతరం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాల్లో బుద్ధుని అవశేషాలు ఆనాటి మట్టి పాత్రలు, పిడతలు లభ్యం కాగా వాటిని చెన్నై, హైదరాబాద్‌ల్లోని మ్యూజియంలకు తరలించారు. తవ్వకాల్లో బయల్పడిన స్థూపం పెద్దపెద్ద ఇటుకలతో నిర్మితమై ఇరువైపులా అశోకచక్రం ఆకారంలో రెండు ధ్యాన మందిరాలు, ఉప స్థూపాలు, చైత్యాలు బయల్పడ్డాయి. బర్మా, జపాన్, టిబెట్, శ్రీలంక, చైనా, తైవాన్ తదితర దేశాలనుంచి బౌద్ధ భిక్షువులతోపాటు మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన భిక్షువులు ఇక్కడికి వచ్చి స్థూపం విశిష్టతను తెలుసుకుని ప్రత్యేకప్రార్థనలు చేస్తారు. బౌద్ధ స్థూపం సమీపంలో బుద్ధవిహార్ ట్రస్టు ఏర్పాటుచేసిన షెడ్డులో బర్మా నుంచి వచ్చిన పాలరాతి విగ్రహంతో పాటు బుద్ధుడు తపస్సు చేసి చిక్కిశల్యమైన శరీరాన్ని తెలియచేసేలా తయారుచేసిన విగ్రహం పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

పురాణ ప్రశస్తి కలిగిన బౌద్ధస్థూపం అభివృద్ధిలో స్థానిక బుద్ధవిహార్ ట్రస్టు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా చేస్తున్న కృషి కీలకం. బుద్ధవిహార్ ట్రస్టు మెంబర్ సెక్రటరీ ఎస్ఎస్ఆర్ భూపతి, కుటుంబసభ్యులు సమకూర్చిన రూ.8 లక్షలతో బౌద్ధ భిక్షువుల వసతి కోసం అతిథిగృహ నిర్మాణాన్ని ఇటీవల చేపట్టారు. బౌద్ధ స్థూపం కీర్తిని తెలియచేయడానికి బుద్ధవిహార్ ట్రస్టు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవం పేరిట ప్రతిఏటా ఇక్కడ పలు కార్యక్రమాలు నిర్వహించి స్థూపం ఖ్యాతిని దేశ, విదేశాలకు విస్తరింపజేస్తోంది.

ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. బౌద్ధ స్థూపాన్ని సందర్శించడానికి వచ్చే బౌద్ధ భిక్షువులు, యాత్రికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. పాశర్లపూడి నుంచి బౌద్ధ స్థూపం వరకు ఏటిగట్టు రోడ్డును ఆధునీకరిస్తే అధిక సంఖ్యలో యాత్రికులు బౌద్ధ స్థూపాన్ని సందర్శించడానికి వీలు కలుగుతుందంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పురాతన చరిత్ర కలిగిన బౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి చారిత్రక నేపథ్యం కలిగిన స్థూప విశిష్టతను దేశ, విదేశాలకు వ్యాప్తి చెందేలా కృషి చేయాలని బుద్ధవిహార్ ట్రస్టు సభ్యులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

బౌద్ధ స్థూపం అభివృద్ధికి స్థానికుల తోడ్పాటు

బౌద్ధ స్థూపం అభివృద్ధిలో స్థానికులు పలువురు దాతలు విరాళాలతో సమీపంలోని 40 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో ధ్యాన మందిరం షెడ్డు ఏర్పాటుచేసి బుద్ధుని విగ్రహాలను ప్రతిష్ఠింపజేసి బుద్ధ జయంతి, పలు ప్రత్యేక రోజుల్లో విశిష్ఠ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఓఎన్జీసీ ఆన్‌షోర్ బౌద్ధ స్థూపం అభివృద్ధికి రూ.4లక్షలు కేటాయించడంతో ప్రహరీ, లైబ్రరీ, మరుగుదొడ్లు నిర్మించారు. రాజమహేంద్రవరం, కాకినాడలకు చెందిన ఓఎన్జీసీ సంస్థ కేటాయించిన రూ.10.70 లక్షల వ్యయంతో టాయిలెట్ బ్లాక్‌ను ఇటీవల నిర్మించారు.

స్థానికుల విరాళాలతో నిర్మితమవుతున్న అతిథి గృహం



నన్నయలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు



నన్నయ వర్శిటీ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వీసీ, తదితరులు

అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శివరామ ప్రసాద్

దివాన్‌చెరువు, మే13 (ఆంధ్రజ్యోతి): అరుదైన మొక్కలతో ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలో బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తామని అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎన్‌వీ శివరామ ప్రసాద్ అన్నారు. యూనివర్శిటీ ప్రాంగణాన్ని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వీసీ ఆహ్వానం మేరకు విశ్వవిద్యాలయాన్ని పరిశీలించామన్నారు. వృక్షశాస్త్రం విద్యార్థులకు విద్య, పరిశోధనలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వర్శిటీ ప్రాంగణాన్ని పూర్తిగా పరిశీలించి అవసరమైన ప్రాంతంలో మొక్కలు నాటుతామన్నారు. వీసీ సూచన మేరకు విశ్వవిద్యాలయాన్ని వర్షాకాలం నాటికి ప్రకృతిజడిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వీసీ మాట్లాడుతూ యూనివర్శిటీ ప్రాంగణంలో మొక్కలు పెంపకంతో అహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం లభిస్తుందన్నారు. నన్నయ ప్రాంగణం రాతినేల కావడంతో వేడి ఎక్కువగా ఉంటుందని, ఈ ప్రాంతంలో విస్తారంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించవలసిన అవసరాన్ని గుర్తించామన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ డీన్ బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనారాయణస్వామి శ్రీపుష్పయాగం



ప్రత్యేక అలంకరణలో భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీపుష్ప యాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఆలయ పండితులు పలు రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఉత్సవమూర్తులకు పలు రకాల ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు, పుష్ప కైంకర్యం, స్నపనం అభిషేకం నిర్వహించి అర్చనలు చేశారు. అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు (బేడా ఉత్సవం) చేశారు. ముగింపులో భాగంగా శయనోత్సవం నిర్వహించి విశేష పవళింపు సేవ పూర్తి చేశారు. ఈవో ఎం.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 1008 మందికి దంపత తాంబూలాలు అందించారు. కాకినాడ రూరల్, సిటీ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తుల ఆకాంక్షల మేరకు బుధవారం రాత్రి ఏడు గంటలకు ముక్తికా సరస్సులో తొలిసారిగా స్వామివారి తెప్పోత్సవం ఏర్పాటు చేసినట్టు ఈవో చెప్పారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



అన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాండవ కిరణ్మయి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

అప్సరలో సింగిల్ బృందం సందడి



అప్సర థియేటర్‌లో సింగిల్ సినిమా చిత్ర బృందం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): నిర్మాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ సమర్పణలో శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా ఆంధ్ర, తెలంగాణాలలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్ర బృందం విజయోత్సవ యాత్ర నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక అప్సర థియేటర్‌ని సందర్శించిన చిత్ర యూనిట్ హీరో శ్రీవిష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిశోర్‌లను గీతా ఫిలిమ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఆహ్వానం పలుకగా ప్రేక్షకులు కేరింతలతో స్వాగతం పలికారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ ఈ నెల 9న విడుదలైన సింగిల్ చిత్రాన్ని విజయవంతం చేసి, మంచి కలెక్షన్లతో ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు కూడా ఇలానే ఆదరించాలని కోరారు. సింగిల్ సినిమా ఎలా ఉంది? కామెడీ అదిరిందా? బాగా ఎంజాయ్ చేస్తున్నారా? అంటూ ప్రేక్షకులతో ముచ్చటించిన శ్రీవిష్ణు, ప్రేక్షకులు సినిమా బాగుందని, కామెడీ ఇంకా బాగుందంటూ వచ్చిన అనూహ్య స్పందనకు అభివాదం చేశారు. వెన్నెల కిషోర్ ప్రేయసి పాత్ర గాయత్రి గురించి సినిమాలో హీరో విష్ణు పదేపదే ప్రస్తావించడం ప్రేక్షకుల్లో జోష్ నింపింది. చిత్రంలో తమ అందచందాలతో అలరించి, అపూర్వగా నటించిన కేతిక శర్మ, హరిణిగా నటించిన ఇవానాలు మాట్లాడుతూ సింగిల్ చిత్రాన్ని ఇంత అపూర్వంగా ఆదరిస్తున్నందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

గోదావరి డెల్టా సిస్టమ్ సీఈగా శ్రీరామకృష్ణ

ధవళేశ్వరం, మే 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్‌గా ఆర్.శ్రీరామకృష్ణ నియమితులయ్యారు. డెల్టా సీఈగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు ఏప్రిల్ నెలాఖరున పదవి విరమణ చేయడంతో విజయవాడ హైడ్రాలజీ విభాగంలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామకృష్ణకు డెల్టా సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఈ నెల 5న బాధ్యతలు స్వీకరించారు. కాగా మంగళవారం పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు.

నిడదవోలులో మంత్రి త్రయం



మంత్రి సత్యప్రసాద్‌కు కోట సత్తెమ్మ తల్లి చిత్రపటం అందజేస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో మరో మంత్రి రవికుమార్

నిడదవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో మంగళవారం ఆయనను రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్ నిడదవోలు విచ్చేసిన సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. వారికి దుర్గేష్ కోటసత్తెమ్మ అమ్మవారి చిత్రపటాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారి వెంట మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్, బొర్రా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తోగుమ్మిలో చండీహోమం

కొవ్వూరు, మే 13(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలోని కొత్తపేటలో విజయదుర్గాదేవి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ దశమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయార్చకులు మాజీ వైస్ ఎంపీపీ మద్దిపాటి సత్యనారాయణ, నాగసూర్యకుమారి దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చండీహోమం జరిపించారు. తదుపరి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ఉడతకు సాయం

ఎండలకు మూగజీవాలు మాడిపోకుండా పలువురు నీరు, ఆహారం ఇచ్చి కాసింత సాయం చేస్తుంటారు. కాకినాడ వివేకానంద పార్కులో అలా ఏర్పాటు చేసిన నీరు తాగి, ఆహారాన్ని తింటూ ఓ ఉడత ఇలా కనిపించింది.

– ఫొటోగ్రాఫర్, కాకినాడ

నేత్రపర్వం

సత్యదేవుడి శ్రీ పుష్పయాగం

- పలు జాతుల సుగంధభరిత పుష్పాలతో అర్చన
- విశేష పదార్థాలు, మధురఫలాలు నివేదన
- ముగిసిన దివ్య కల్యాణోత్సవాలు

అన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా చివరిరోజైన మంగళవారం శ్రీ పుష్పయాగం నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 7.30కి నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, పెళ్లి పెద్దలైన సీతారాములను మంగళవాయిద్యాల నడుమ వేడుక జరిగే నిత్య కల్యాణమండపం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేర్వేరు వేదికలపై ఆశీనులు గావించి ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్‌లు గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నవదంపతులను వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో శేషపాన్పుపై పవళించే విష్ణుమూర్తిగా సత్యదేవుడను, ఆయన పాదాలు సుతిమెత్తగా ఒత్తుతున్న దేవిగా అమ్మవారిని అలంకరించి వేడుక కోసం తీసుకొచ్చిన వివిధ జాతుల పుష్పాలతో అష్టోత్తర శతసహస్ర నామాలతో అర్చకస్వాములు అర్చించారు. ఈ సందర్భంగా వివిధ రకాలైన తీపిపదార్థాలు, మధురఫలాలను నివేదించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందించారు. భక్తులు ఈ వేడుకను ఊగుటూయలకు ఎదురుగా ఏర్పాటుచేసిన అద్దంలో వీక్షించి పునీతులయ్యారు. అనంతరం దంపతులకు దంపతీతాంబూలాలు కార్యక్రమానికి హాజరైన మహిళా భక్తులకు రవికవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఇంద్రగంటి సుధీర్, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి నిర్వహించారు. అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి వందలాది మహిళలు హాజరయ్యారు. ఈ వేడుకతో సత్యదేవుని విశ్వావసు నామసంవత్సర కల్యాణోత్సవాలుముగిశాయి.



పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో విష్ణుమూర్తిగా సత్యదేవుడు, మహాలక్ష్మిగా అనంతలక్ష్మి

'సురుచి' మిఠాయిలు

మండపేట, మే 13(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి శ్రీపుష్పయాగానికి కోనసీమ జిల్లా తాపేశ్వరం సురుచి మిఠాయిల తయారీసంస్థ 9రకాల మిఠాయిలను అందజేసినట్టు సంస్థ యాజమాని పోలిశెట్టిమల్లి ఖార్జునరావు (మల్లిబాబు) తెలిపారు. తాపేశ్వరంలో మిఠాయిలకు ప్రత్యేక పూజలు అనంతరం అన్నవరానికి తీసు కెళ్లారు. గత ఐదేళ్ల నుంచి స్వామికి మిఠాయి ప్రసాదాన్ని అందిస్తున్నామని మల్లిబాబు చెప్పారు.



శ్రీపుష్పయాగానికి సురుచి సంస్థ సమర్పించిన మిఠాయిలు



స్వామి,అమ్మవార్లకు నివేదించిన మధురఫలాలు, విశేష పదార్థాలు



పుష్పార్చన కోసం వివిధ జాతుల పుష్పాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

భయపెట్టేసింది!

ముమ్మిడివరంలో తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, మే 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలోని ఓ గృహంలో తాచుపాము హల్‌చల్ చేసి అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. తిరుపతి చిన్నీ నివాసం గృహంలోకి తాచుపాము చేరి హల్‌చల్ చేయడంతో ఇంట్లోనివారు, చుట్టుపక్కలవారు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మకు గృహయజమాని చిన్నీ సమాచారం అందించడంతో పామును చాకచక్యంగా బంధించాడు. వేసవి తాపానికి పాములు బయటికి వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్మ సూచించాడు. పాము కనిపిస్తే తనకు సమాచారం అందించాలని, వాటిని ఎవరూ చంపవద్దని విజ్ఞప్తి చేశాడు.



తాచుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

సీబీఎస్ఈ 10, ప్లస్2 ఫలితాల్లో 'శ్రీ ప్రకాష్' విద్యార్థుల విజయకేతనం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ప్రకటించిన పదో తరగతి, ప్లస్2 ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఎన్.సత్యసాయి 483/500, ఎం.యశస్వి 482/500, పి తరుణ్‌కుమార్ 481/500, ఎస్.రఘునందన్ 478/500 మార్కులతో అగ్రగాములుగా నిలిచారని తెలిపారు. ప్లస్2 ఫలితాల్లో జి.సాయి అనీష్ 469/50, ధాత్రి నిహారిక 466/500 సాధించి అగ్రగాములుగా నిలిచారని, నూటికి నూరుశాతం ఉత్తీర్ణతా శాతంతో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో తమ విద్యార్థులు 100కి 100 మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకె.నరసింహారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



ప్లస్2 ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జి.సాయిఅనీష్, ధాత్రి నిహారిక



పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎన్.సత్యసాయి, ఎం.యశస్వి, పి.తరుణ్‌కుమార్, ఎస్.రఘునందన్

ఇసుక ట్రాక్టర్ బోల్తా : యువకుడి మృతి

కేసు లేకుండా బాధిత కుటుంబ సభ్యులతో రాజీకి యత్నం



బోల్తా పడి ఉన్న ట్రాక్టర్

ఎటపాక, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ మీదపడి ఓ గిరిజన యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాయనపేట వద్ద నూతనంగా కల్వర్టు నిర్మాణం జరుగుతున్న సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుక దందా చేస్తున్న ఎటపాకకు చెందిన ఓ వ్యక్తి తన ట్రాక్టర్లతో అర్ధరాత్రి రాయనపేట గోదావరి నదీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను భద్రాచలానికి రవాణా చేస్తున్నాడు. అయితే అర్ధరాత్రి అప్పటికే ఒకసారి భద్రాచలానికి ఇసుక రవాణా చేసి మరోమారు గోదావరిలోకి ఇసుక లోడు కోసం వస్తున్న క్రమంలో రాయనపేట వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి సుమారు 8 అడుగుల కిందకు పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న రాజుపేట గ్రామానికి చెందిన కోడి చరణ్ (16) ట్రాక్టర్‌తో పాటు కింద పడిపోయాడు. దీంతో ట్రాక్టర్ మీద పడి చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్ పై నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించే చరణ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ ఘటనపై ఎటువంటి కేసు లేకుండా ఉండేందుకు ఇసుక దందా సాగించే సదరు వ్యక్తి బాధిత కటుంబ సభ్యులతో రాజీయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఇందుకు బాధిత కుటుంబానికి రూ2లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్టు సమాచారం. అయితే ఈ ఘటనపై ఏ ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అప్పలరాజు తెలిపారు.



మరణించిన చరణ్ (ఫైల్)

సరదా కాస్తా విషాదం

ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి దిగి విద్యార్థి గల్లంతు

- పోలీసుల గాలింపు చర్యలు
- తీవ్ర అస్వస్థతకు గురైన మరొకరు
- బయటపడిన ఇద్దరు విద్యార్థులు



పెదశంకర్లపూడి వద్ద విద్యార్థి గల్లంతైన ఏలేరు ఎడమ కాలువ



గల్లంతైన విఘ్నేష్ (ఫైల్)



చికిత్స పొందుతున్న సిరిబాబు

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి ఏలేరు ఎడమ కాలువలో మంగళవారం సాయంత్రం నలుగురు విద్యార్థులు స్నానానికి దిగారు. వీరిలో ఒకరు గల్లంతు కాగా మరో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మరో ఇద్దరు విద్యార్థులను స్థానికులు కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువలో పెదశంకర్లపూడి వద్ద మంగళవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన పంది వీర వెంకట సత్యనారాయణ అలియాస్ విఘ్నేష్ (14), కాకినాడ సిరిబాబు (14), ఏళ్ళ సోరాబత్తుల రాజా (14), ఏళ్ళ శివ(14) సరదాగా స్నానాలు చేసేందుకు వెళ్లారు. వారిలో విఘ్నేష్, సిరిబాబు కాలువ ఉధృతికి కొట్టుకుపోగా విఘ్నేష్ గల్లంతయ్యాడు. కాలువలోకి దిగుతున్న రాజా, శివలను స్థానికులు కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. సిరిబాబు అధికంగా నీళ్లు తాగేయడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారి వెంటనే ఏలేశ్వ రం ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన విఘ్నేష్ ఆచూకీ తెలియరాలేదు. ఆ నలుగురు లంపకలోవ జిల్లా పరిషత్‌లో హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నారు. పెదశంకర్లపూడిలోని పంది రాంబాబు, సత్యవేణి దంపతుల ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన విఘ్నేష్ ఏలేరు ఎడ మ కాలువలో గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విఘ్నేష్ ఇంటికి ప్రత్తి పాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. సంఘటనా స్థలానికి వచ్చి విఘ్నేష్ ఆచూకీ కోసం ఉధృతంగా చర్యలు చేపట్టాలని ఏలేరు అధికారులను ఆదేశించారు. కాలువలో నీటి ఉధృతిని తగ్గించాలని సూచించారు. విఘ్నేష్ ఆచూకీ కోసం ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో పల్గొన్నారు. స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన విఘ్నేష్ ఆచూకీ కోసం ముమ్మర చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి వరకు గాలింపు చేపట్టినా విఘ్నేష్ ఆచూకీ తెలియరాలేదని, బుధవారం ఉదయం గాలింపు చేపడతామని ఎస్ఐ తెలిపారు.



సంఘటనా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



మృతదేహం

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి తుని - హంసవరం రైల్వేస్టేషన్ల మధ్య తుని అతిధి కల్యాణ మండపానికి ఎదురుగా ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీకి వెనుక గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి 20 నుంచి 25 ఏళ్ల యువకుడు మరణించినట్టు రైల్వే పోలీసులు వెల్లడించారు. మృతదేహంపై నలుపురంగు ట్రాక్, ఎడమ చేయిపై శ్రావణి అనే పచ్చబొట్టు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

కరప, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో సోమవారం రాత్రి ఒక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాల ప్రకారం... కరప మార్కెట్ సెంటర్ వెనుక నివాసముంటున్న ఇల్ల దుర్గారావు(60)ను భార్య వదిలేయడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. గతేడాది కుమారుడు మరణించడంతో మరింత కుంగిపోయాడు. భార్య కాపురానికి రాకపోవడం, కుమారుడి మరణంతో మనస్తాపానికి గురైన దుర్గారావు తునిలో ఉంటున్న కుమార్తెకు ఫోన్ చేసి చనిపోతున్నట్టు తెలిపాడు. అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

14 మంది అరెస్టు

పెద్దాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం, జి.రాగంపేట గ్రామ శివార్లలో పేకాట శిబిరాలపై మంగళవారం దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,64,610నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొత్తపల్లిలో గడ్డిమేటు దగ్ధం

కొత్తపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన రైతు లొల్ల వీర వెంకట సత్యనారాయణ 8 ఎకరాల్లో గడ్డిమేటు వేసుకున్నాడు. మంగళవారం తెల్లవారు జామున గడ్డిమేటు దగ్ధమవుతోందని సమీప రైతులు సమాచారం ఇచ్చారని, చేలోకి వెళేసరికి గడ్డి బూడిదైందని రైతు వాపోయాడు. మిషన్‌తో కోయించిన గడ్డిని ఒబ్బిడి చేసేందుకు రూ.70వేలు ఖర్చయిందన్నాడు. కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పాడు.



చేనులో దగ్ధమవుతున్న గడ్డిమేటు

ఉప్పలంకలో కుటుంబంపై దాడి

చర్యలు తీసుకుంటాం : ఎస్ఐ

కరప, మే 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామంలో సోమవారం సాయంత్రం ఒక కుటుంబంపై పలువురు గ్రామస్తులు దాడి చేసి గాయపర్చారు. బాధితులు తెలిపిన సమాచారం ప్రకారం... ఉప్పలంకకు చెందిన సంగాని ప్రసాద్ మార్కెట్ యార్డు, రెడ్‌క్రాస్ బిల్డింగ్ వద్ద ఈ నెల 11న చెరువు రొయ్యలను ఎండబెట్టాడు. అదే గ్రామానికి చెందిన గేదెల పెద్దసత్తిబాబు తదితరులు ఎండబెట్టిన రొయ్యలను ఆటోతో తొక్కుకుంటూ పోయారు. దీనిపై ప్రసాద్, అతడి కుటుంబసభ్యులు వారిని నిలదీయగా దుర్భాషలాడారని, 12న సాయంత్రం తమ ఇంటిపైకి వచ్చి తనతో పాటు తన భార్య చిన తల్లిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారని ఆరోపించాడు. తీవ్ర గాయాలైన ప్రసాద్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు ప్రసాద్ తెలిపాడు. ఎంఎల్‌సీ రిపోర్టు అందిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట సునీత తెలిపారు.



దాడిలో గాయపడిన సంగాని ప్రసాద్

భార్య, ప్రియుడిని పట్టుకున్న భర్త

కాకినాడ క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): భర్త లేని సమయంలో గుట్టుచప్పుడుగా ప్రియురాలి వద్దకు వచ్చి వెళ్తూ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న వ్యక్తిని భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ నగరంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి గుడి సమీపంలోని బాదం వారి వీధిలో నివాసముంటున్న ఓ వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చొల్లంగి వద్ద రొయ్యల చెరువుల్లో పని చేస్తుంటాడు. అతడి భార్య ప్రస్తుతం ఎల్‌ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే ఆమె ఓ ప్రైవేటు లా కాలేజీలో లా చదివే సమయంలో సహవిద్యార్థి బాలమణికంఠ పరిచయం అయ్యాడు. పరిచయం కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. ఈ నేపథ్యంలో ఆమె భర్త డ్యూటీకి రొయ్యల చెరువు వద్దకు వెళ్లిన సమయంలో మణికంఠ వస్తూ పోతూ ఉండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి డ్యూటీకి వెళ్లిన భర్త తన భార్య వ్యవహార శైలిపై అనుమానం వచ్చి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి తన భార్య మణికంఠతో ఉండడాన్ని చూసి బయట తలుపునకు గడియ పెట్టి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మజ్జి అప్పలనాయుడు ఇంటి వద్దకు చేరుకుని ఫిర్యాదు చేసిన వ్యక్తి భార్య, ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం), మే 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడిని విశాఖపట్నంలోని సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న కాకినాడకు చెందిన చీకట్ల వెంకట మణిచందు అలియాస్ చందుని కాకినాడలో అరెస్టు చేశారు. 4 స్మార్ట్ ఫోన్లు, కీపాడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక లారీ ఢీకొని రైతు మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు



రమణ (ఫైల్)

తుని రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని వి.కొత్తూరు జంక్షన్‌లో జరిగింది. వి.కొత్తూరుకు చెందిన సూరెడ్డి రమణ (48) గ్రామంలో వి.కొత్తూరులో కూరగాయల సాగు చేసి తుని రైల్వే బజార్లో విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. మంగళవారం ఉదయం రైతు బజారుకు కూరగాయలు తరలించి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వి.కొత్తూరు జంక్షన్‌లో విశాఖ వైపు వెళ్తున్న ఇసుక లారీ బలంగా ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన రమణ అక్కడికక్కడే మృతి చెందగా స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీని అడ్డగించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కృష్ణమాచార్యులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రమణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



సమ్మోర్

వేసవి సెలవులు కావడంతో చింతూరు మండలం మోతుగూడెంలో ఎండలో సైతం తమ స్నేహితులతో కలిసి చెట్ల నీడలో ఆడుకుంటూ.. సీలేరు నదిలో సేదతీరుతూ మోర్ ఎంజాయ్ అంటున్న చిన్నారుల దృశ్యాలు

మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

మడికి అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ సమయాల్లో మార్పు

ఈ నెల 20 నుంచి అమలు

ఆలమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద ఉన్న అంతర్ రాష్ట్ర కూరగాయ మార్కెట్లో ఈనెల 20 నుంచి కూరగాయ అమ్మకాలు, కొనుగోళ్లలో కచ్చితమైన సమయాలు పాటించనున్నట్టు అభయాంజనేయ కూరగాయల మార్కెట్ కమిటీ కార్యదర్శి చెల్లుబోయిన సింహాచలం తెలిపారు. మార్కెట్ సమయాల వివరాలను ఆయన వివరించారు. మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాలు ఉదయం నుంచి ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం రెండు గంటల తరువాత మాత్రమే మళ్లీ మార్కెట్ ప్రారంభమవుతుందని ఈ విషయాన్ని రైతులు, వర్తకులు గమనించాలని ఆయన సూచించారు. ఎట్టి పరిస్థితిలోను మధ్యాహ్నం రెండు గంటల ముందు అమ్మకాలు ప్రారంభంకాదని, రైతులు ఇబ్బందులు పడి వచ్చి ఇక్కడ నిరీక్షించాలిసి వస్తుందని అందువల్ల సమయాలను పాటించి మార్కెట్‌కు రావాలని సింహాచలం కోరారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించండి

జిల్లా, సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త కనకబాబు



గోవిందరాజాపురంలో సర్వే నిర్వహిస్తున్న కనకబాబు

రంగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న 0 నుంచి 18 సంవత్సరాల వయసున్న ప్రత్యేక అవసరాల పిల్లలు(దివ్యాంగులు) అందరినీ గుర్తించడం, వైకల్యం నిర్ధారణ చేసి వీరు పేర్లు పాఠశాలల్లో నమోదు చేయాలని జిల్లా, సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త ఎన్.కనకబాబు రంగంపేట ఐఈఆర్‌టీలకు సూచించారు. మంగళవారం మండలంలోని గోవిందరాజాపురంలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 13 నుంచి జూన్ 9వరకు ఈ ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు, పాఠశాలల్లో నమోదు చేసే కార్యక్రమం రాష్ట్రమంతా జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా పిల్లలందరూ పాఠశాలలో వారి పేరు నమోదు చేయించుకోవడంతో ప్రభుత్వం ద్వారా అందించే సదుపాయాలు, సౌకర్యాలన్నీ ప్రత్యేక అవసరాల పిల్లలకు అందుతాయని, ప్రభుత్వం ద్వారా వారికి అవసరమైన ఉపకరణాలన్నీ అందిస్తారని పేర్కొన్నారు. వీరికి అవసరమైన ప్రత్యేక విద్యను, ఫిజియోథెరపీ సేవలను కూడా అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు అంజలి, ప్రసాద్, ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో డ్రగ్స్ రహిత సమాజం

ఈగల్ సీఐ సూర్యమోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యమోహనరావు

రాజానగరం, మే (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణం సమష్టి బాధ్యత అని ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్)సీఐ పీవీ సూర్యమోహనరావు అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు గైట్ అటానమస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి అధ్యక్షతన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఈగల్ సీఐ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా, వినియోగానికి యువత దూరంగా ఉండాలని, వాటిపై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం ఈగల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అవి తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, నేరాలకు చట్టపరమైన శిక్షలు, సైబర్ మోసాలను వివరించారు. కార్య క్రమంలో ఈగల్ ఎస్ఐ బి.నరేష్‌కుమార్, జీజీయూ ఎన్ఎస్ఎస్ పీవో బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలు రాకుండా చూసుకోవాలి

అవగాహన సదస్సులో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తూనికలు, కొలతల పట్ల అవగాహన ఉండాలని, తూనికలు, కొలతల్లో తేడా లేకుండా వ్యాపారస్తులు వినియోగదారులకు వస్తువులను విక్రయించాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగేంద్ర అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ రైతుబజార్‌లో లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ వ్యాపారస్తులు కాటాలకు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, ఎంఆర్‌పీ ధర మించి ఎక్కువకు అమ్మితే చర్యలు తప్పవని అన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు అనంత రావు, రైతుబజార్ ఎస్టేట్ అధికారిణి రోజియా, కన్స్యూమర్స్ రైట్స్ అవేర్‌నెస్ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.

చైనా వస్తువులను నిషేధించాలి : టీకే



సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌కు సహకరించిన చైనా, టర్కీ దేశాలకు సంబంధించిన వస్తువులు, టూరిజంలను కేంద్రం నిషేధించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించడంతో పాటు పహల్గామ్‌లో దాడి చేసి 26 మందిని దారుణంగా కాల్చిచంపేసారని అటువంటి ఉగ్రవాదంపై యుద్ధం ప్రకటించిన భారత దేశం ఇప్పుడు ఎటువంటి షరతులు లేకుండా యుద్ధాన్ని నిలుపుదల చేయడం సరికాదన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ విషయంలో గాని, సింధూ జలాల విషయంలోగాని, ఎటువంటి షరతులు లేకుండా ఎలా యుద్ధాన్ని నిలిపారని ప్రశ్నించారు. పాకిస్థాన్, దానికి సహకరించిన దేశాల ఉత్పత్తులను నిషేధించాలని, టర్కీ దేశానికి మన దేశం నుంచి వెళ్లే పర్యటకులను నిలుపుదల చేయాలని అన్నారు.

కన్నుల పండువగా జనార్దనస్వామి గ్రామోత్సవం



కడియం, మే 13(ఆంధ్రజ్యోతి): జేగురుపాడులో జనార్దనస్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. సోమవారం రాత్రి సుందరంగా అలంకరించిన వాహనంపై స్వామిని ఉంచి, మేళతాళాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామ పురవీధుల్లో జనార్దనస్వామి ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కర్రి చినబాబు, గారపాటి అమరనాథ్, ఉసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, వనమాలి బాలాజీ పాల్గొన్నారు.

రంగాపురం చెరువుకు నీరందించండి

బిక్కవోలు, మే 13(ఆంధ్రజ్యోతి): ఇళ్లపల్లిలోని ఎత్తిపోతల పథకం నుంచి రంగాపురం కుడుముల చెరువుకు నీరందించేందుకు పైపు లైను లేదా సిమ్మెంటు కాలువను ఏర్పాటు చేయాలని జిల్లా ఎత్తిపోతల కార్యనిర్వాహక అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి ఐడీసీ ఇంజినీర్లను కోరారు. మంగళవారం ఇళ్లపల్లిలోని విఘ్నేశ్వర ఎత్తిపోతల పథకానికి ఏయే అవసరాలు వున్నాయో పరిశీలించడానికి రాజమహేంద్రవరం నుంచి ఐడీసీ కార్యాలయం నుంచి సిబ్బంది వచ్చారు. ఈ సందర్భంగా వారు మోటార్లు, పానెల్‌బోర్డు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులను గుర్తించారు. నిర్మాణ సమయం నుంచి సమస్యగా మారిన సంప్‌వెల్ నిర్మాణానికి సానుకూలత వ్యక్తంచేసింది. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సురేంద్ర, సాంకేతిక నిపుణుడు ప్రసాద్, తోటకూర పద్దరాజు, డైరెక్టర్ అనుసూరి సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

రంగంపేట,మే 13 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు 307 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారని పరీక్షల సీఎస్ బి.హేమ తెలిపారు. ఉదయం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 304 మందికి గాను 289 మంది, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 21 మందికి గాను 18 హాజరయ్యారని ఆమె తెలిపారు. రెండవ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

మహాలక్ష్మి తల్లిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి కిరణ్మయి



మహాలక్ష్మి తల్లికి పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి

కడియం, మే 13(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి మంగళవారం కడియపులంక మహాలక్ష్మి తల్లిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, వైస్ ఎంపీపీ పంతం గణపతి, రావిపాటి రామకృష్ణ, రావిపాటి వెంకటేష్, ప్రగడరెడ్డి రాంబాబు, పల్ల ప్రసాద్, పంతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

తాళ్లపూడి, మే 13(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుముతో పాటు అదే తప్పు పదే పదే చేస్తే కఠినంగా శిక్షిస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలో పలు చోట్ల ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనదారుడు సీబుక్, లైసెన్సు, ఇన్సూరెన్సు వంటి ధ్రువ పత్రాలు కలిగి ఉండాలన్నారు.

క్వారీ గోతుల పూడ్చివేతకు చర్యలు



మ్యాప్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

» రెండున్నర కిలోమీటర్లు రోడ్డు నిర్మించండి
» లీజుదారులు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : కలెక్టర్
» బ్లాక్ లిస్టులోని లీజుదారుల నుంచి రిక్లమేషన్ చార్జీల రికవరీకి ఆదేశాలు

రాజమహేంద్రవరం, మే 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని రామదాసుపేట, సుబ్బారావు నగర్ ప్రాంతాల్లో కంకర కోసం తవ్విన క్వారీ గోతులను పూడ్చే విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు మునిసిపల్ కార్పొరేషన్, ఆర్ అండ్‌బీ తదితర శాఖలతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీల లీజు పొందిన 51 సంస్థలు మెటల్(కంకర) తవ్విన తర్వాత సదరు గోతులను మట్టితో పూడ్చాలనే నిబంధన పాటించలేదనే విషయం తెలిసిందన్నారు. ఆయా క్వారీ గోతుల వల్ల సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు వినియోగించే రహదారి ప్రమాదకరంగా మారిందన్నారు. ఆ దారిలో వెళ్లే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు సంభవించకుండా చేయడంలో భాగంగా రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించి, ఫెన్సింగ్ వేయడంతోపాటు లైటింగ్, సైన్ బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇవన్నీ పూర్తయ్యేలోపు ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రహదారి నిర్మాణ పనులకు సంబంధించి సాంకేతిక అంశాల పరిశీలనకు ఒక ప్రత్యేక కమిటీని వేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి క్వారీలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. బ్లాక్ లిస్టులో పెట్టిన లీజుదారుల వివరాలను అన్ని శాఖలకు పంపాలని, రిక్లమేషన్ చార్జీల రికవరీ కోసం నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రాజేంద్రనగర్, సుబ్బారావుపేట, నెహ్రూనగర్, బర్మాకాలనీ, బత్తిన నగర్, సంజీవయ్యనగర్, సింహాచల నగర్, రామదాసుపేట, ఆనంద్‌నగర్‌లో ఉన్న 22ఏ భూముల క్రమబద్ధీకరణ వివరాలను అందజేయాలన్నారు.సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్, మైనింగ్ శాఖ ఏడీ డి.ఫణి భూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి

» పోటీ ఎక్కువ.. సమయం తక్కువ
» పునశ్చరణకు ప్రాధాన్యమివ్వాలి
» పోటీపరీక్షల కోచింగ్ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు
» డీఎస్సీపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధం కావాలని పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రణాళికాబద్ధమైన, సృజనాత్మక పఠనంతో డీఎస్సీ విజయం ఖాయమన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో యూటీఎఫ్, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అభ్యర్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని, గత పరీక్షల ప్రశ్నాపత్రాల మోడల్ చూసుకోవాలని అన్నారు. చాలా కాలం తర్వాత డీఎస్సీ నిర్వహిస్తున్నందున పోటీ ఎక్కువగా ఉంటుందన్నారు. అభ్యర్థులు కొత్త విషయాలు ఎక్కువగా నేర్చుకునే కన్నా తాము చదివిన సబ్జెక్టును మననం చేసుకుంటూ పునశ్చరణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. పరీక్షల నిర్వహణకు సమయం కాస్త తక్కువ ఉన్నందున గడువు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సందేహాలను నివృత్తిచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు పలు పత్రికల్లో రాసిన వ్యాసాల సంకలనం 'సమకాలీన వ్యాసాలు' అనే పుస్తకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి ఆవిష్కరించారు. ఆయన రాసిన విద్యామనో విజ్ఞానశాస్త్రం స్టడీ మెటీరియల్‌ను అభ్యర్థులకు ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్, డీవైఎఫ్ఐ బాధ్యులు రాంబాబు, యూటీఎఫ్ నాయకులు పవన్‌కుమార్, కే.విజయగౌరి, వీవీఎస్ఆర్ ప్రసాద్, కే.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, దయానిధి, రమణమూర్తి, ఎం.శ్రీనివాస్, రూపస్‌రావు, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌లో నగరాభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
» పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కార్‌లో రాజమహేంద్రవరంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని పదో డివిజన్‌లో ఐదు పార్కులు, 9వ డివిజన్‌లో రెండు కలిపి స్థానిక మోడల్ కాలనీ వద్ద సుమారు రూ.1.95 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లో వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, అవసరమైన చోట్ల రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. రూ.22 కోట్లతో గోదావరి గట్టున రివర్ ఫ్రంట్ పనులకు అంకురార్పణ జరిగిందన్నారు. ఎమ్మెల్సీ సోము మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే రాజమహేంద్రవరంలో మరింతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎమ్మెల్యే వాసు రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి రాంబాబు, వాసిరెడ్డి బాబి, వై.శ్రీను, పి.నాగేంద్ర, యెనుముల రంగబాబు, జామి సత్యనారాయణ, చొప్పెర్ల భద్రరావు పాల్గొన్నారు.

బీసీ ప్రముఖుల విగ్రహాల ఏర్పాటును అడ్డుకుంటున్న మాజీ ఎంపీ

టీడీపీ బీసీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్న బీసీ ప్రముఖుల విగ్రహాలను అడ్డుకోవడాన్ని మాజీ ఎంపీ భరత్‌రామ్ లక్ష్యంగా పెట్టుకున్నారని టీడీపీ బీసీ నేతలు బుడ్డిగ రాధా, కిలపర్తి శ్రీను, మునిని బాబురావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గోదావరి బండ్‌పై హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య విగ్రహం ఏర్పాటు విషయంలో భరత్‌రామ్ అడ్డుకున్నారని ఆరోపించారు. తామంతా మాజీ కేంద్ర మంత్రి కింజరపు ఎర్రన్నాయుడు, తాండ్ర పాపారాయుడు విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరడంతో దానికి ఎమ్మెల్యే వాసు అంగీకరించారన్నారు. ఈ విగ్రహాలను మోరంపూడి సమీపంలో మునిని బాబురావుకు చెందిన స్థలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుని అందుకు ఏర్పాట్లు చేస్తుండగా భరత్‌రామ్ దానికి మోకాలడ్డటానికి ప్రయత్నిస్తున్నాడని, వైసీపీ నాయకుడు మజ్జి అప్పారావుతో మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయించాడన్నారు. బాబురావు మాట్లాడుతూ ఏవీ అప్పారావు రోడ్డులో తమ తాత విగ్రహం ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, దీంతో తమ స్థలంలో ఎర్రన్నాయుడు, పాపారాయుడు విగ్రహాలు పెట్టుకునేందుకు అంగీకరించామన్నారు.దీనిని కూడా అడ్డుకోవడం బీసీల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు.సమావేశంలో కడలి రామకృష్ణ, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, సప్పా వెంకటరమణ, మండల రవి, ఆడారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



రాజానగరం, మే 13(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఒక మహిళ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురై ఏలూరు జిల్లా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. రాజానగరం మండలం కలకచర్ల గ్రామానికి చెందిన బొమ్మెతి కుమారి(40) హైదరా బాద్‌లో ఉన్న తన చెల్లిని చూడడానికి ఈనెల 12వ తేదీ రాత్రి తన తల్లిదండ్రులతో కలిసి ద్వారపూడిలో గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు లేడీస్ కంపార్టుమెంట్ ఎక్కారు. రైలులో ప్రయాణిస్తుండగా ఏలూరు సమీపంలోని సత్రంపాడు వద్ద ప్రయాణికుల రద్దీ ఉండడం వల్ల బోగి గుమ్మంలో ఉన్న ఆమె ప్రమాదవ శాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురైంది. 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఉపాధి కల్పించాలి

ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల ఆందోళన

సీతానగరం, మే 13(ఆంధ్రజ్యోతి) తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు మంగళవారం ఉదయం ర్యాంపునకు ట్రాక్టర్లు అడ్డుపెట్టి ఆందోళన చేపట్టారు. 117 ఎకరాలలో ప్రక్కిలంక లంక భూముల నుంచి 7 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరపడానికి అనుమతులు ఇచ్చారు. ఇసుకను రఘుదేవపురం ర్యాంపు నుంచి తీసుకువెళ్లడానికి అధికారులు అనుమతి ఇచ్చి ఓపెన్‌రీచ్‌ను ఏర్పాటు చేశారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రొక్లెయినర్‌లతో డంపింగ్ చేసి లారీలపై ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు. గోదావరి వచ్చే సమయానికి సుమారు 2.5లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించవలసి ఉంది. దీంతో రఘుదేవపురంలోని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు ర్యాంపునకు ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి ఆందోళన చేపట్టారు. 80 కుటుంబాలు దీనిపై ఆదారపడి జీవిస్తున్నాయని, తమకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్లతో ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు డంపింగ్ చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు.



నేటి నుంచి పాశాలమ్మ జాతర

కొవ్వూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మ జాతర బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 14, 15 తేదీల్లో అమ్మవారి ఊరేగింపు, 16న గుడి సేవ, గ్రామోత్సవం, 17న బలిచేట, 18న అమ్మవారిని అత్తింటికి పంపుట, నైవేద్యాలు, 22న పుట్టింటికి తీసుకురావడం జరుగుతుందన్నారు.

19న జీఎస్ఎల్‌లో ధన్వంతరి ఆలయ ప్రతిష్ఠ

రాజానగరం, మే 13(ఆంధ్రజ్యోతి): రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ ధన్వంతరి ఆలయ ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మంగళవారం తెలిపారు. ప్రతిష్ఠాపనలో భాగంగా 16 నుంచి 19వరకు హోమాలు, పూజలు జరుగుతాయన్నారు. 19న ఉదయం ప్రతిష్ఠాపన సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం జరుగుతాయన్నారు.

'కిశోరి వికాసం' వినియోగించుకోవాలి

దివాన్‌చెరువు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేసవి సెలవులు ఉపయోగపడేలా నిర్వహిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీపీవో రాజకుమార్ కోరారు. దివాన్‌చెరువులో మంగళవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టాలను వివరించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, దాని ప్రభావం వారి చదువు, ఆరోగ్యంపై పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ కాలువలో గుర్రపు డెక్క తొలగింపు

అనపర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు రెండు రోజులుగా సుమారు 450మంది ఉపాధి కూలీలు కాలువలో పూడికలు తొలగిస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ముందుగానే తూడు తొలగించాలన్న సంకల్పం, ఎమ్మెల్యే కృషితో నీటి సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో తూడు తొలగింపు శరవేగంగా సాగుతుంది. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, కొమరిపాలెం డీసీ ఛైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, వైస్ ఛైర్మన్ కర్రి వెంకటరెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మహా అన్న సమారాధన

ధవళేశ్వరం, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ముగింపు సందర్భంగా మంగళవారం ఉత్సవ కమిటీ ఛైర్మన్ నీలి కోటేశ్వరరావు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయం పక్కనే ఉన్న కల్యాణ మండప ప్రాంగణంలో నిర్వహించిన మహా అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గన్ని కృష్ణ, రాష్ట్ర టూరిజం బోర్డు డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, యర్రా వేణుగోపాలరాయుడు, ఆకుల వీర్రాజు, మచ్చేటి శివసత్యప్రసాద్, మజ్జి పద్మ, పండూరి అప్పారావు, యడ్ల మహేష్, యర్రమోతు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నివాస స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి


అనపర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని ఫైర్ స్టేషన్ సమీపంలో జిల్లా పరిషత్ స్థలంలో సుమారు 40 ఏళ్లుగా పేదలు నివాసం ఉంటున్న స్థలాలను క్రమబద్ధీకరించి వారికి పట్టాలు అందించే కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శ్రీకారం చుట్టారు. మంగళవారం స్థానిక రజక కళ్యాణ మండపంలో నివాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న సుమారు 20 కుటుంబాల వారికి 2012లో ఇచ్చిన హామీ మేరకు వారి స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అలాగే గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. నివాసితుల వివరాలతో ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించామని త్వరలోనే పట్టాలు పంపిణీ చేస్తామ న్నారు. ఈ సందర్భంగా నివాసితులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కూ టమి నాయకులు సత్తి దేవదాన రెడ్డి, జుత్తుగ కృష్ణ, రావాడ నాగు, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

అనపర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): అనపర్తిలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంగళవారం రాజమహేంద్రవరంలోని ప్రజారోగ్య శాఖ అధికారులు అనపర్తి చేరుకుని క్యాంటీన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఈఈ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనపర్తిలో సుమారు రూ.60 లక్షలతో క్యాంటీన్ నిర్మించేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చామని, త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీఈ విజయ పార్వతి, కేసీపీ కంపెనీ ప్రతినిధులు, పంచాయతీ అధికారులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో గురుకులం విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం, మే 13(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ సత్యసాయి గురుకులం విద్యార్థులు నూరు శాతం మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటారని కరస్పాండెంట్ శ్యాం సుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య తెలిపారు. 35 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 24 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఆయుష్ కుమార్ అనే విద్యార్థి అత్యధికంగా 92.2% మార్కులు సాధించాడన్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు వారు అభినందనలు తెలిపారు.




రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0 (మంగళవారం)
కనిష్ఠం : 27.0

8 మేమున్నాం..
సైన్యానికి మద్దతుగా జనసైన్యం

డిస్పోజబుల్!

ప్రజారోగ్యంపై ప్లాస్టిక్ భూతం



ఇలా తెచ్చినా ప్రమాదమే సుమా : ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయాలు

ఎవరు తీసిన గోతిలో వాళ్లే పడతారు.. ప్రస్తుత తరానికి ఈ సామెత అతికినట్టు సరి పోతోంది.. అనువుగా ఉంది కదా అని వినియోగానికి ప్లాస్టిక్ అనే గొయ్యి తవ్వుకున్నారు.. ప్రస్తుతం అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారు.. అలాగని వదల్లేకపోతున్నారు..క్యాన్సర్ వంటి మహమ్మారి చుట్టుముడుతున్నా అదే తీరు.. మార్పు కానరావడంలేదు.. ఒకనాడు జనా వాసంలో ప్లాస్టిక్ వినియోగం లేదు.. క్యాన్సర్ కేసులు లేవు..ప్రస్తుతం వినియోగం పెరిగింది.. టీ తాగే కప్ నుంచి భోజనం చేసే ప్లేట్ వరకూ అంతా ప్లాస్టిక్కే.. దీంతో రకరకాల క్యాన్సర్ కేసు లు జనంపై దాడులు చేస్తున్నాయి.. చిన్న వయ సులోనే ప్రాణాలు తీస్తోంది.. అయినా మన జీవ న విధానంలో మార్పురావడంలేదు.. నేను ఆరోగ్యంపై చాలా శ్రద్ధ తీసుకుంటాను..నాకెలా క్యాన్సర్ వచ్చిందనే వాళ్లు ఒకసారి ఆలోచిస్తే అసలు కథ బోధపడుతుంది.. ఇకనైనా మారాల్సిందే.. ప్లాస్టిక్ వదిలేయాల్సిందే.. - (రాజమహేంద్రవరం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)



చూశారా..చిత్రం : కాకినాడ దమ్ములపేట వద్ద డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది.ప్రజారోగ్యాన్ని పీల్చి పిప్పి చేస్తోంది. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయని ఎన్ని అవగాహన కార్యక్రమాలు సాగుతున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో మా ర్పు రావడం లేదు. ఇక వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు.దీంతో ప్లాస్టిక్ వినియోగం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోతోంది. ప్లాస్టిక్‌ను స్థానిక సంస్థలు నిషేధించినా.. అమలులో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. కింది స్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా మారి పోయింది.దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి

- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- అరికట్టలేకపోతున్న అధికార గణం
- రోగాలకు గురవుతున్న జనం
- క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం
- రోజుకు 300 టన్నుల వ్యర్థాలు
- డంపింగ్‌యార్డుల నిండా అదే
- ఇకనైనా దృష్టి పెట్టాల్సిందే
- లేకపోతే సర్వనాశనమే

ఇదీ సర్వే మాట

మనం వాడి పడేస్తు న్నాం.. మనకేంటి.. అని సంబర పడుతుంటే ప్లాస్టిక్ వ్యర్థాల్లో కాలు వేసి నట్టే. ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, కూరగాయలు, టీ తదితర ఆహార పదార్థాలు తీసుకురావడం. ప్యాకేజింగ్‌కి ప్లాస్టిక్ సంచులను వాడడం, ప్లాస్టిక్ కోటింగ్‌తో తయారు చేసిన కృత్రిమ ఆకులు, గ్లాసులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని విని యోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్ రేణువులు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రం గులు రావడానికి ఎన్నో రసాయనాలు కలు పుతారు. వాటిలో సీసం, కాడ్మియం తదితర రసాయనాల వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూల తలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదు గుదలపై ప్రతికూల ప్రభావం.. ఇలా రకరకాల దారుణ రుగ్మతల బారిన పడుతున్నామని వివిధ సర్వేలు చెవిలో పోరు పెడుతేన్నాయి.

ప్లాస్టిక్‌ను వదిలేద్దాం!

ఒక్క ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి పదేళ్లు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అనంతం. అందువల్ల పాలిథీన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాల్సిందే. ఇవాళ పాలి థీన్ సంచి అవసరమైతే చిన్న కిళ్లీ బడ్డీలో కూడా దొరుకుతుంది. నార సంచి కావాలంటే వెతుకు లాడాల్సిందే.ఈ పరిస్థితి మారాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వాటిని ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్, జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళా దుంప నుంచి తీసే పిండి బయో పాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్ది రోజులకే భూమిలో కలిసి పోవడం వల్ల పర్యావరణానికి హాని ఉండదు. ఇలాంటి ప్రత్యా మ్నాయాలపై తక్షణమే దృష్టి సారించాలి.



టీ కప్‌లో తుఫాన్..

ప్లాస్టిక్ టీ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు వినియోగం బాగా పెరిగింది. టీ దుకాణాల వద్ద వేడి టీని పాలిథీన్ కవర్లలో వేస్తున్నారు.దాని వల్ల పాలిథీన్ కవర్ కరిగి ఆ టీలో కలిసిపోతుంది. అది తాగిన వారికి కొన్ని రోజులకు కాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. డిస్పోజబుల్ కప్‌లో చిన్న ప్లాస్టిక్ పొర ఉంటుంది.

క్యాన్సర్ కొనితెచ్చుకుంటున్నాం..

రోజులో మన వాడకాల్లో సగానికిపైగా ప్లాస్టిక్ భూతమే ఉంటోంది.పర్యావరణం,ప్రజల ఆరోగ్యాలను నాశనం చేస్తోంది. కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు రకరకాల క్యాన్సర్లకి కారణమవుతూ కుటుంబాల్లో ప్రళయాన్ని సృష్టిస్తున్నాయి.75 మైక్రాన్లలోపు మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించకూడదనే నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు.75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న పాలిథీన్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తున్నారు.వీటిని నియంత్రించిన అధికారు లు చోద్యం చూస్తున్నారు. ప్రజలు వినియోగించిన పాలిథీన్ కవర్లను రోడ్లపై వేయడంతో అవి మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయని జంతుప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 300 టన్నులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రోజుకు సగటున సుమారు 600 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 300 టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటు న్నాయి. ఎక్కడైనా డంపింగ్‌యార్డ్ వద్దకు వెళ్లి చూడండి.. అంతెందుకు గోదావరి గట్టుకు వెళ్లి చూడండి ప్లాస్టిక్ కనిపించకుండా చెత్త ఉండదు.హోల్‌సేల్ దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది. స్వచ్ఛభారత్ వంటి పురస్కారాల కోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాల లెక్కను తొక్కిపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్లాస్టిక్ వస్తువు లేని ఇల్లు లేదు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేని డ్రెయినూ కనబడదంటే అతిశయోక్తి కాదేమో!.



కాకినాడలో డెయిరీఫాం సెంటర్ వద్ద ఇలా..



కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆర్‌అండ్‌బీ రహదారి

దారి మారు!

రహదారులపై కోట్లు పోస్తున్న ప్రభుత్వం

- అన్ని దారుల వైపు చూపు
- రోడ్లపై సాఫీగా ప్రయాణం
- 10 నెలల్లో రోడ్లు బాగుబాగు
- నాబార్డు నిధులు విడుదల
- 16 రోడ్లకు 29.92 కోట్లు
- టెండర్లు పిలవాలని ఆదేశం

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తోంది. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ రహదారులకు రూ.200కోట్లకు పైగా విడుదల చేసింది.. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని 39 పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ.73.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 76.188 కిలోమీటర్ల పొడవునగల 16 రహదారుల అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.29.92 కోట్లను విడుదల చేస్తూ జీవో జారీ చేసింది.ఈ మేరకు టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది.వర్షాకాలం నాటికి రాష్ట్రంలో రహదారులపై ఎక్కడ గుంతలు కనబడకూడదని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దిష్టంగా ఆదేశాలిచ్చారు. ఆర్‌అండ్‌బీశాఖ తాత్కాలిక, శాశ్వత కార్యాచరణలు సిద్ధం చేసుకుని తదనుగుణంగా పనులు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రహదారుల మరమ్మతుల పనులు చేపట్టి 75 శాతం వరకూ పూర్తి చేసింది. మిగిలిన పనులు వర్షాలు రాకుండా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కాకినాడకు రూ.13.20 కోట్లు

- నాబార్డు ఆర్ఐడీఎఫ్ 30వ విడత ద్వారా కాకినాడ జిల్లాలో 37.516 కిలోమీటర్ల పొడవు గల ఆరు రహదారుల అభివృద్ధికి రూ.13.20 కోట్లు మంజూరు చేశారు. తిప్పరాజుపాలెం-కాజులూరు రోడ్డుకు రూ3.10 కోట్లు, రావికంపాడు-రమణక్కపేట రోడ్డుకు రూ.2 కోట్లు, యండపల్లి జంక్షన్-నాగులాపల్లి-రావివారిపోడు రోడ్డుకు రూ.3.50 కోట్లు,జెడ్.రాగంపేట ఎన్‌హెచ్ నుంచి నాయకంపల్లి రోడ్డుకు రూ.60లక్షలు,ఏలేశ్వరం-జడ్డంగి లింక్ రోడ్డుకు రూ.కోటి,కట్టమూరు-కాంద్రకోట-జె.తిమ్మాపురం రోడ్డుకు రూ.3 కోట్లు.

తూర్పుగోదావరి జిల్లా..

- తూర్పుగోదావరి జిల్లాలో 26.807 కిలోమీటర్ల పొడవు గల 8 రహదారుల అభివృద్ధికి రూ.12.50 కోట్లు కేటాయించారు. ఆర్‌కేరోడ్డు శాటిలైట్ సిటీ-సంపత నగరం-జి.యర్రంపాలెం-కొత్తతుంగపాడు రోడ్డుకు రూ.2 కోట్లు, పెద్దాపురం ఏడీబీ రోడ్డు-నాయకంపల్లి-జి.దొంతమూరు రోడ్డుకు రూ.80 లక్షలు, వీరవరం-దుళ్ల రోడ్డుకు రూ.1.80 కోట్లు, రాజవోలు-వేమగిరి-కడియం-కొత్తూరు రోడ్డుకు రూ.50 లక్షలు, యర్రాయిచెరువు-పి.వేమవరం రోడ్డుకు రూ. 1.26 కోట్లు, వడ్లూరు-తీపర్రు రోడ్డుకు రూ.3.24 కోట్లు, తేతలి-మునిపల్లి రోడ్డుకు రూ.60 లక్ష లు, పశివేదల-ఆరికిరేవుల రహదారి అభివృదికి రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి.

కోనసీమ జిల్లా..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11.865కిలోమీటర్ల పొడవు గల రెండు రహదారుల అభివృద్ధికి రూ.4.22 కోట్లు కేటాయించారు. శివకోడు-రామరాజులంక, లక్కవరం-శంకరగుప్తం, శివకోడు మునలమ్మ ఆలయం నుంచి విశ్వేశ్వరరాయపురం రోడ్ల అభివృద్ధికి రూ.2.50కోట్లు,గోపాలపురం నుంచి గంటిలొల్ల రోడ్డు,గోపాలపురం-పొడగట్లపల్లి రోడ్డు, గంటి-గోపాలపురం పుష్కరఘాట్-పొడగట్లపల్లి రోడ్ల అభివృద్ధికి రూ.1.72 కోట్లు మంజూరు చేశారు.

జిల్లాలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలి పర్యటన

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయానీ రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్నారు. బుధ, గురువారాల్లో జిల్లా అధికారులతో కలిసి పలు ప్రదేశాలను పరిశీలిస్తారు.గురువారం సాయంత్రం 4గంటలకు విమానంలో బయలుదేరి ఢిల్లీ తిరుగు పయనమవుతారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఆమె పర్యటనకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

చెరువుల్లో సిల్టు తొలగింపునకు అనుమతులు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ మే 4(ఆంధ్రజ్యోతి): చిన్న నీటి పారుదల చెరువులు(మైనర్ ఇరిగేషన్)లో రైతులు తమ సొంత ఖర్చులతో సిల్టు తవ్వకం, రవాణాకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 203 జారీచేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిల్టు తొలగించడానికి ముందుకు వచ్చే రైతులకు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో షరతులతో కూడిన అనుమతులిస్తామన్నారు. నిబంధనల మేరకు సిల్ట్ తొలగింపు పనులు చేయాలన్నారు.

పక్కింటికి భోజనానికెళితే.. ఇల్లు దోచేశారు..

రాజానగరం, మే 13 (ఆంధ్రజ్యోతి) : పక్కింటికి భోజనానికి వెళితే ఇంట్లో దొంగలు పడ్డారు. మండలంలో వెలుగుబందలో ఓ ఇంట్లో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి విలువైన బంగారు ఆభరణాలను అపరించుకు పోయారు. గ్రామానికి చెందిన జాలెం గోపీరత్నం మంగళవారం ఇంటికి గడియపెట్టి పక్కింటికి భోజనానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెలిసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించుకోగా 4 కాసుల బంగారు ఆభరణం అపహరణకు గురైనట్టుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజానగం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సీఎఫ్ఎంఎస్..పంచాయితీ!



- డిజిటల్ సైన్ పక్కదారి
- పనిచేయని కమిషనర్ తంబ్
- గత ఆరు నెలలుగా ఇదే తంతు
- కార్యదర్శులకు ఇబ్బంది
- కలెక్టర్‌కు ఫిర్యాదు?
- రహస్య విచారణకు ఆదేశం
- నేడో రేపో నివేదిక

రాజమహేంద్రవరం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో పది గ్రామాల సీఎఫ్ఎంఎస్ పంచాయితీ కలెక్టర్ దృష్టికి వెళ్లింది. గ్రామాల్లో ఎలాంటి ఖర్చులు చేపట్టినా బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్ ద్వారానే జరుగుతాయి. ప్రతి బిల్లు సీఎఫ్ఎంఎస్‌లో నమోదు చేసిన తరువాత సంబంధిత అధికారి వేలిముద్ర వేసిన మీదట చెల్లింపులు జరుగుతాయి. ఆయా గ్రామాల, మండలాల డీడీవో అధికారికే తంబ్ వేసే అధికారం ఉంటుంది. రూరల్ మండల పరిధిలో గల 10 గ్రామాలకు ప్రత్యేకాధికారి నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ కావడంతో ఆయనే తంబ్ వేయాల్సి ఉంటుంది. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు నెలవారీ జీతాలు, కార్యాలయాల నిర్వహణ, అభివృద్ధి పనుల నిమిత్తం చేసిన ఖర్చులకు సంబంధించి కమిషనర్ వద్దకు వెళుతుంటే తంబ్ పని చేయడం లేదు. దీంతో మరలా పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి మార్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఎందుకంటే డిజిటల్ సైన్‌లో ఎలాంటి మార్పులు చేయాలన్నా ఎంపీడీవో సెల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ నెంబరు నమోదు చేస్తేనే మార్పు జరుగుతుంది. సుమారు 6 నెలలుగా ఇదే తంతు కొనసాగుతుంది.ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శులు కమీషనర్‌కు ఫిర్యాదు చేసారో లేక, ఆయన పరిశీలనలో తేలిందో తెలియదు గాని వ్యవహారం జిల్లా కలెక్టర్‌కు కమిషనర్ తెలియజేసినట్టు సమాచారం. దీనిపై మండల పరిధిలోని కొందరు కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అధికారిని పిలిపించి కలెక్టర్, కమిషనర్లు నేరుగా ఆరాతీసినట్టు తెలి సింది. ఒక అధికారికి డీడీవోగా బాధ్యతలు అప్పగించిన తరువాత ఆ అధికారి బదిలీ అయి నపుడో.. లేక మరొక అధికారికి బాధ్యతలు అప్పగించినప్పుడు మాత్రమే డిజిటల్ సైన్ (తంబ్) మార్చాలి. అలాంటిది ఒక ఐఏఎస్ అధికారి ప్రత్యేకాధికారిగా ఉన్న గ్రామాలకు సంబంధించి తరచు రూరల్ మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తంబ్ మార్చడాన్ని కలెక్టర్, కమిషనర్‌లు సీరియస్‌గా తీసుకున్నారు.దీనిపై ట్రెజరీ అధికారుల నుంచి నివేదిక తీసుకున్నారు.

వీణాదేవి విచారణ..

ఈ ఘటనకు సంబంధించి జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జి వీణాదేవిని విచారణాధికారిగా నియమిం చినట్టు తెలిసింది.కలెక్టరేట్‌లోని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జి కార్యాలయంలో మంగళవారం రూర ల్ మండల పరిధిలోని గ్రామ కార్యదర్శుల నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారు..అదే విధంగా రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు నుంచి తీసుకున్నా రు.అనంతరం నివేదికను కలెక్టర్, పంచాయతీ రాజ్‌కు కమిషనర్ పంపనున్నారు.



పరీక్షలపై సమీక్షిస్తున్న డీఆర్వో

19 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 28 వరకూ నిర్వహించే పదో తరగతి, ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో టి.సీతారామమూర్తి ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం అధికారులతో సమీక్షించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 28 కేంద్రాల్లో రెగ్యులర్ 3,167, ప్రైవేటు 686 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఏపీ ఓపెన్ స్కూల్‌కి సంబంధించి పదో తరగతి 589 మంది 6 పరీక్షా కేంద్రాల్లో, ఇంటర్ విద్యార్థులు 771 మంది 4 కేంద్రాల్లో పరీక్షలు రాస్తారని చెప్పారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ జరుగుతాయన్నారు. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని తెలిపారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్దేశిత సమయం కంటే ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఈవో వాసుదేవ రావు, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీ కుమారి, ఎంపీఐ సీహెచ్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 380 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్ విభాగంలో 335 మంది, వొకేషనల్‌లో 45 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎస్ నరసింహం తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ కలిపి మొత్తం 9955, వొకేషనల్‌లో 625 మంది పరీక్షలు రాశారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాత్రి వేళల్లో గస్తీ పెంచండి

- పాత నేరస్తులపై నిఘా పెట్టాలి
- క్రైం టీమ్‌లు అప్రమత్తం కావాలి
- క్రైం సమీక్షలో ఎస్పీ ఆదేశం

రాజమహేంద్రవరం, మే 13(ఆంధ్రజ్యోతి): క్రైం టీంలు, స్పెషల్ పార్టీ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని..ముఖ్యంగా రాత్రి వేళల్లో నేరాలను అరికట్టడానికి గస్తీ పెంచాలని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆస్తి నేరాలపై సమీక్షించారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను ప్రశ్నించడంతో పాటు ఫింగర్ ప్రింట్ డివైజెస్, ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ల ద్వారా వివరాలను పరిశీలించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై పోలీసులకు సమాచారం ఇవ్వడంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తుల నేరాల్లోని పాత నేరస్తులు,జైలు నుంచి విడుదలవుతున్న వాళ్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న నిర్మానుష్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ డంతో పాటు రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ నిర్వహించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీలతో పాటు అసాంఘిక వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పటిష్టం చేయాలన్నారు.డ్రోన్ కెమెరాల వ్యవస్థ వినియో గించి నేరస్తులపై దృష్టి పెట్టాలన్నారు.కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు,ఎస్ఐలు, క్రైం, స్పెషల్ పార్టీ విభాగాల పోలీసులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనాలి : జేసీ

8 ప్రణాళికాబద్ధంగా చదివితే డీఎస్సీ విజయం



భూసేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భూసేకరణపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం, మే 13(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు విమానాశ్రయ, రైల్వే, జాతీయ, రాష్ట్ర రహదారులు, పురపాలన, బీసీ సంక్షేమ శాఖల విషయంలో భూసేకరణపై రెవెన్యూ, సంబంధిత శాఖల ప్రతినిధులతో ఆమె మంగళవారం సమీక్షించారు.27 అంశాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. ఏడీబీ రోడ్డు, రైల్వేకు సంబంధించి కాపవరం, జేగురుపాడు, నిడదవోలు, సింగవరం,శెట్టిపేట, ఆర్‌అండ్‌బీకి సంబంధించి నిడదవోలు,కొవ్వూరు మునిసిపాలిటీ పరిధిలోని మురుగు నీటి శుద్ధి కేంద్రం, గంగోలు, సాగిపాడు,దొండపూడి,కరగపాడు, పట్టిసీమ, కొవ్వూరు హైవే, బీసీ సంక్షేమ భవనాలకు చెందిన భూసేకరణపై చర్చించామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామ్మూర్తి,ఆర్డీవోలు కృష్ణ నాయక్,రాణిసుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, కోచింగ్ నిపుణుడు లక్ష్మణరావు

ప్రణాళికాబద్ధంగా చదివితే..
డీఎస్సీ విజయం తథ్యం

● పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు లక్ష్మణరావు

రాజమహేంద్రవరం అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : అకడమిక్ పరీక్షలకు, కాంపిటీటివ్ పరీక్షలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధం కావాలని పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రణాళికాబద్ధమైన సృజనాత్మక పఠనంతో డీఎస్సీ విజయం ఖాయమని పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో యూటీఎఫ్, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అభ్యర్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని, గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నాపత్రాల మోడల్ చూసుకోవాలని అన్నారు. చాలాకాలం తర్వాత డీఎస్సీ నిర్వహిస్తున్నందున పోటీ ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అభ్యర్థులు కొత్త విషయాలు ఎక్కువగా నేర్చుకునే కన్నా తాము చదివిన సబ్జెక్టును మననం చేసుకుంటూ పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు సమయం కాస్త తక్కువ ఉన్నందున గడువు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు పలు పత్రికల్లో రాసిన వ్యాసాల సంకలనం సమకాలీన వ్యాసాలు' అనే పుస్తకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి ఆవిష్కరించారు. లక్ష్మణరావు రాసిన విద్యామనోవిజ్ఞానశాస్త్రం స్టడీ మెటీరియల్‌ను అభ్యర్థులకు ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్, డీవైఎఫ్ఐ బాధ్యులు రాంబాబు, యూటీఎఫ్ నాయకులు పవన్‌కుమార్, కే.విజయగౌరి, వీవీఎస్ఆర్ ప్రసాద్, కే.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, దయానిధి, రమణమూర్తి, ఎం.శ్రీనివాస్, రూపస్‌రావు, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

మద్దతు ధర కల్పించేలా
ధాన్యం కొనుగోలు చేయాలి

● జేసీ చిన్నరాముడు

కొవ్వూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి మిల్లర్లు కొనుగోలుచేసే ధాన్యం ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మద్దతు ధర కల్పించే క్రమంలో కొనుగోలు ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మిల్లర్లతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాకు నిర్ధేశించిన 3.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ధేశించామన్నారు. దానికి అనుగుణంగా మండల పరిధిలో ధాన్యం కొనుగోలుచేస్తామన్నారు. రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలుచేసే సమయంలో విధిగా బీ రిజిష్టర్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ధాన్యం ఏ రిజిష్టర్‌లోను నమోదు చేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ప్రతి సీజన్‌లో రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలుచేయడం సర్వసాధారణంగా జరిగే ప్రక్రియ అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోరాణి సుస్మిత, ఇన్‌చార్జి పౌరసరఫరాల అధికారి ఎం.ఆర్.ఎస్.ప్రేమ్‌కుమార్, ఏఎస్‌వో ఎం.నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మిల్లర్ల అసోసియేషన్ నాయకులు సుంకవల్లి రమేష్, మట్టే ప్రసాద్, సూరపనేని శివరామకృష్ణ, ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5న విజయవాడలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల
రాష్ట్ర 3వ కౌన్సిల్ సమావేశాలు


సమావేశంలో పాల్గొన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కొవ్వూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జూన్ 5వ తేదీన విజయవాడలో జరుగనున్న రాష్ట్ర 3వ కౌన్సిల్ సమావేశాలను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ నక్కా వెంకటరత్నం అన్నారు. మంగళవారం కొవ్వూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో కొవ్వూరు తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ దాసరి మోహన్ అధ్యక్షతన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ చైర్మన్ నక్కా వెంకటరత్నం మాట్లాడుతూ జూన్ 5వ తేదీన విజయవాడలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపీజీఏ ఆధ్వర్యంలో కె.ఆర్.సూర్యనారాయణ నాయకత్వంలో సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార వేదికగా ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేలు వర్తింపచేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఔట్ సోర్సింగ్ జేఏసీ తరపున, ఐక్యవేదిక తరపున సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్.హరికృష్ణ, పి.శివప్రసాద్, సీహెచ్. వెంకటరాజు, కె.సురేష్, కె.ఫణికుమార్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు
సద్వినియోగం చేసుకోవాలి


చంద్రవరం శాఖా గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శేఖర్

చాగల్లు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రవరం శాఖాగ్రంథాలయంను జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఎం.శేఖర్ మంగళవారం సందర్శించారు. వార్షిక తనిఖీ నిమిత్తం వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం వేసవివిజ్ఞాన తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన తరగతులను యువకులు, విద్యార్థులు సహా అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి సెలవులను కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగించుకోవాలని, పాఠ్యపుస్తకాలతో పాటుగా దేశ నాయకులు చరిత్ర, జనరల్ నాలెడ్జి, సృజనాత్మక విషయాలు తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నెక్కంటి శ్రీనివాసరావు, కె.సుమన్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత

● మంత్రి కందుల దుర్గేష్


నిడదవోలులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ఆరోగ్య భద్రత చేకూరుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలో నిమంత్రి క్యాంపు కార్యాలయంలో 23మందికి రూ.19,18,415ల విలువైన చెక్కులను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో 91మందికి రూ.1,16,53,394ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీలు పంపిణీ చేశామన్నారు. ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన బాధిత కుటుంబాలకు సంబంధితశాఖ ద్వారా ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం ప్రత్యేకంగా అందించామన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి తగిన ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందన్నారు. అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మద్దతుగా కదిలిన జనసైన్యం

● పురాతన ఆలయాల్లో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పూజలు


బిక్కవోలులో లక్ష్మీగణపతికి పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, మే 13(ఆంధ్రజ్యోతి): దేవతలకు సర్వసైన్యాధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి అని, ఆయన సురులను అసురుల నుంచి కాపాడిన విధంగా ముష్కరులు మనదేశం మీద ఉగ్రదాడి చేస్తే ఆ దాడి నుంచి కాపాడిన నిజమైన సైన్యాధ్యక్షులు మన భారత సైనికులని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అంతకు ముందు ఆయన జనసైనికులతో బస్సులో వచ్చి ముందుగా గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలనంతరం ఆలయం ముందు హారతులిచ్చి విలేకర్లతో మాట్లాడారు. పహల్గామ్‌లో అమాయకులను పొట్టన బెట్టుకున్న ఉగ్రవాదులపై మన సైన్యం పోరాటం చేస్తోందని ఇది ఒక మతం, దేశంపై చేస్తున్న పోరాటం కాదన్నారు. మన సైనికులు చూపిస్తున్న తెగువ, త్యాగం దృష్టిలో వుంచుకుని వారికి ఆత్మస్థైర్యం, ధైర్యం ఇవ్వాలని, అలాగే ప్రధాని మోదీ ఈ దేశాన్ని రక్షించడానికి, సమైక్యంగా వుంచడానికి చేస్తున్న ప్రయత్నానికి బాసటగా నిలబడతామనే మాట చెప్పేందుకు దక్షిణ పథాన ఉన్న అన్ని షణ్ముఖ క్షేత్రాల్లో అభిషేక కార్యక్రమాలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశించడంతో చేస్తున్నామన్నారు.అనంతరం ఆ యన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో కలసి గ్రా మంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన బిక్కవోలులోని ప్రాచీన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చే యాలంటూ వినతి పత్రాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి.. మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అం దజేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ గంటా స్వరూప, రాష్ట్రమహిళా నాయకురాలు ప్రియసౌజన్య, అనపర్తి ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి, రావాడ నాగు పాల్గొన్నారు.


మంత్రి సత్య ప్రసాద్‌కు కోటసత్తెమ్మ చిత్రపటం అందజేస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

నిడదవోలులో ముగ్గురు మంత్రుల భేటీ

నిడదవోలు, మే 13(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫిశాఖా మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో మంగళవారం మంత్రి దుర్గేష్‌ను రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నిడదవోలు విచ్చేసిన మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్ లు నిడదవోలు విచ్చేసిన సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి మంత్రి దుర్గేష్ కోటసత్తెమ్మ అమ్మవారి చిత్రపటాలు అందించి సత్కరించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పార్టీ అధ్యక్షులు రంగా రమేష్, బొర్రా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పాశాలమ్మ జాతర


పాశాలమ్మ అమ్మవారు

కొవ్వూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 14, 15 తేదీలలో గరగనృత్యాలు, బుట్టబొమ్మలతో అమ్మవారిని గ్రామపురవీధులలో ఊరేగించటం, 16న ద్రాక్షారామ మేళం, తీపర్రు వారి బాణాసంచా, జగన్నాధపురం వారిచే కాళికాదేవి వేషధారణతో గుడిసేవ, అనంతరం గ్రామోత్సవం, 17న పిప్పర మేళం, తీపర్రు బాణసంచా, బలిచేట, 18న అమ్మవారిని అత్తగారింటికి పంపుట, నైవేద్యములు, మొక్కులు తీర్చుకోవటం, 22న అమ్మవారిని పుట్టింటికి తీసుకువస్తారు.

సమస్యలు లేని నియోజకవర్గంగా
గోపాలపురాన్ని తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో సమస్యలులేని నియోజకవర్గంగా గోపాలపురాన్ని తీర్చిదుద్దుతానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం నారా చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కలిసి వివిధ అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో ప్రతీఏటా వర్షాకాలంలో ఎగువప్రాంతం నుంచి ప్రవహిస్తూ పంటలను ముంపునకు గురిచేస్తున్న ఎర్రకాల్వ, కొవ్వాడకాల్వ, తాడిపూడి కాల్వల ఆదునికీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలంటూ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. నల్లజర్ల, దేవరపల్లి, ద్వారకా తిరుమల మండల కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 30పడకల ఆసుపత్రులుగా (సామాజిక) ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని వీటితోపాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రామాకేర్ సెంటర్‌లు ఏర్పాటుచేయాలని సీఎంని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని జనసేన కార్యకర్త భార్య ఉన్నమట్ల సత్యలక్ష్మికి వైద్య చికిత్స నిమిత్తం రూ.3లక్షల 50వేలు మంజూరయ్యాయని, అయితే మంజూరైన సొమ్ము వైద్యానికి సరిపో దని వైద్యులు తెలపటంతో ఆ మొత్తాన్ని రూ.6లక్షల 50వేలకు పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎల్‌ఓసీ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మద్దిపాటి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు చేయాల్సిందిగా సీఎంని కోరామన్నారు. దీనిపై సీఎం నారా చంద్రబాబు సానుకూలంగా స్పందించారని అన్నారు. పక్క నియోజకవర్గంతో పోలిస్తే అభివృద్ధికి వెనుకబాటులో ఉన్న గోపాలపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో సొంత నియోజకవర్గాలతో పోటీపడేలా తనవంతు కృషి చేస్తానని అన్నారు.

జనసేన సభ్యత్వం కిట్లు పంపిణీ


జనసేన పట్టణాధ్యక్షుడు దేగల రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఇంచార్జి టి.వి.రామారావు

కొవ్వూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు నియోజకవర్గ జనసేన కార్యాలయంలో మంగళవారం క్రియశీలక సభ్యత్వం కిట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి.రామారావు ఆధ్వర్యంలో క్రియశీలక సభ్యత్వాలలో నియోజకవర్గంలో అత్యధికంగా 551 సభ్యత్వాలు నమోదు చేసిన పట్టణ అధ్యక్షుడు దేగల రామ్‌కుమార్‌ని టి.వి.రామారావు, జిల్లా కోఆర్డినేటర్ వరిశెట్టి వెంకటేశ్వరరావు సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీలు ఎరుబండి సురేష్, వీరా హరిబాబు, నాయకులు సిద్దా రామకృష్ణ పాల్గొన్నారు.

'కిశోరి వికాసం' వినియోగించుకోవాలి

దివాన్‌చెరువు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేసవి సెలవులు ఉపయోగపడేలా నిర్వహిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీపీవో రాజకుమార్ కోరారు. దివాన్‌చెరువులో మంగళవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టాలను వివరించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, దాని ప్రభావం వారి చదువు, ఆరోగ్యంపై పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

19న జీఎస్ఎల్‌లో ధన్వంతరి ఆలయ ప్రతిష్ఠ

రాజానగరం, మే 13(ఆంధ్రజ్యోతి): రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడి కల్ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ ధన్వంతరి ఆలయ ప్రతిష్ఠాప న, మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మంగళవారం తెలిపారు. ప్రతిష్ఠాపనలో భాగంగా 16 నుంచి 19వరకు హోమాలు, పూలు జరు గుతాయన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, మే 13(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుముతోపాటు అదే తప్పు పదే పదే చేస్తే కఠినంగా శిక్షిస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలో పలుచోట్ల ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన సి బుక్, లైసెన్సు, ఇన్సూరెన్సు వంటి ధ్రువపత్రాలు ఉండాలని, హెల్మెట్ ధరించడం వలన ప్రాణాలకు రక్షణగా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సీరియస్‌గా పరిగణిస్తామని ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా శిక్షార్హులవుతారని తెలిపారు.

దేవరపల్లిలో కుంటుపడిన పారిశుధ్యం


చెత్తాచెదారంతో ఉన్న రోడ్డు

దేవరపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో పారిశుధ్యం కుంటుపడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుచ్చయ్యపాలెం రోడ్డులో ఉన్న దేవరపల్లి ఇళ్ల స్థలాలవద్ద చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వెంటనే ప్రతీరోజు శానిటేషన్ చేయాలని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దేవరపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎస్‌బీఐ మేనేజర్ కాశీవిశ్వనాధం మా నివాసాల వద్ద చెత్తకుప్పలు కుప్పలుగా ఉందని పంచా యతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లిన చెత్త తొలగించటం లేదన్నారు. ఇంటిపన్నులు సక్రమంగా చెల్లిస్తున్నప్పటికీ ప్రజలకు అందాల్సిన శానిటేషన్ పనులు చేయడంలేదని వెంటనే మా వీధిలో ఉన్న చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు.

క్వారీ గోతుల పూడ్చివేతకు చర్యలు

● మ్యాప్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మే 13(ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్రవరంలోని రామదాసుపేట, సుబ్బారావునగర్ ప్రాంతాల్లో కంకర కోసం తవ్విన క్వారీ గోతులను పూడ్చే విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు మునిసిపల్ కార్పొరేషన్, ఆర్అండ్‌బీ తదితర శాఖలతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీల లీజు పొందిన 51 సంస్థలు మెటల్(కంకర) తవ్విన తర్వాత సదరు గోతులను మట్టితో పూడ్చాలనే నిబంధన పాటిం చలేదనే విషయం తెలిసిందన్నారు. ఆయా క్వారీ గోతులవల్ల సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు వినియోగించే రహదారి ప్రమాదకరంగా మారిందన్నారు. ఆ దారిలో వెళ్లే సమయంలో ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని సూచించా రు. ప్రమాదాలు సంభవించ కుండా చేయడంలో భాగంగా రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించి, ఫెన్సింగ్ వేయడంతోపాటు లై టింగ్, సైన్ బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇవన్నీ పూర్తయ్యేలోపు ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రహదారి నిర్మాణ పనులకు సంబంధించి సాంకేతిక అంశాల పరిశీలనకు ఒక ప్రత్యేక కమిటీని వేయాలని సూచించారు.

నిడదవోలు పెన్షనర్స్ సహకారం అభినందనీయం



నిడదవోలు పెన్షనర్స్ కార్యాలయం లో జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి చెక్కు అందజేస్తున్న సంఘ సభ్యులు

నిడదవోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిర్మించనున్న జిల్లారాష్ట్ర పెన్షనర్స్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి నిడదవోలు పెన్షనర్స్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు కేజీకే మూర్తి అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాజమహేంద్రవరంలో నిర్మించనున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యాలయ భవననిర్మాణానికి నిడదవోలు పెన్షనర్స్ సంఘం సభ్యులు రూ.1,16,116 సేకరించి చెక్కురూపంలో అందించారు. నిడదవోలు పెన్షనర్స్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో చండీహోమం

కొవ్వూరు, మే 13(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలోని కొత్తపేటలో ఉన్న శ్రీ రాధాకృష్ణ సమేత షిరిడిసాయి, విజయదుర్గాదేవి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అర్చకులు ఏలూరిపాటి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు మద్దిపాటి సత్యనారాయణ, నాగసూర్యకుమారి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చండీహోమం జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మద్దిపాటి నాగేశ్వరరావు, యాగంటి ఈశ్వరరావు, ఒమ్మి గోవిందు, గదుల గోవిందు పాల్గొన్నారు.


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు